RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 16 | ISSUE: 41 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM | 7-9-2025 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 16 | సంచిక : 41 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం | 7-9-2025 | పేజీలు : 8 | రూ: 2/-



# నేడు ఆకాశంలో 'బ్లడ్ మూన్'...

**భారత్ లో ఎప్పుడు, ఎక్కడ కనిపిస్తుందంటే...!**

**నేడు సంపూర్ణ చంద్ర గ్రహణం**


**బ్లడ్ మూన్' గా ఎరుపు రంగులో దర్శనమివ్వనున్న చందమామ**

**భారతదేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో వీక్షించే అవకాశం**

**రాత్రి 11 గంటల నుంచి 82 నిమిషాల పాటు పూర్తి గ్రహణ దశ**

**ప్రత్యేక పరికరాలు లేకుండా నేరుగా చూసే వీలు**

**వాతావరణం అనుకూలిస్తే అద్భుతమైన వీక్షణ**



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

రేపు ఆకాశంలో ఓ అద్భుతమైన, అరుదైన దృశ్యం ఆవిష్కృతం కానుంది. సెప్టెంబర్ 7, ఆదివారం రాత్రి చంద్రుడు ఎరుపు రంగులో (బ్లడ్ మూన్) దర్శనమివ్వనున్నాడు. ఇది ఒక సంపూర్ణ చంద్రగ్రహణం. ఈ ఖగోళ అద్భుతాన్ని భారతదేశంలోని చాలా ప్రాంతాల నుంచి వీక్షించే అవకాశం ఉండటంతో ప్రజలు, ఖగోళ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తే, ప్రపంచ జనాభాలో దాదాపు 85 శాతం మంది ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**ఎందుకిలా జరుగుతుంది?**

చంద్రగ్రహణం అనేది సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖపైకి వచ్చినప్పుడు సంభవిస్తుంది. సూర్యుడి కాంతిని భూమి అడ్డుకోవడం వల్ల, భూమి నీడ చంద్రుడిపై పడుతుంది. దీనినే చంద్రగ్రహణం అంటారు. చంద్రుడు పూర్తిగా భూమి నీడ (అంబ్రా)లోకి ప్రవేశించినప్పుడు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతుంది. ఈ సమయంలో భూమి వాతావరణం గుండా ప్రసరించే సూర్యకాంతి వంగి, చంద్రుడిపై పడుతుంది. ఈ ప్రక్రియలో నీలం రంగు కాంతి చెదిరిపోయి, ఎరుపు-నారింజ రంగు కాంతి మాత్రమే చంద్రుడిని చేరుకుంటుంది. అందుకే చంద్రుడు ఎర్రగా, అంటే 'రక్త చంద్రుడి'లా కనిపిస్తాడు. ఈ అద్భుత దృశ్యం దాదాపు 82 నిమిషాల పాటు కొనసాగనుంది.


**భారతదేశంలో గ్రహణ సమయాలు**

భారత కాలమానం ప్రకారం, గ్రహణం సెప్టెంబర్ 7 రాత్రి 8:58 గంటలకు పాక్షిక నీడ (పెనుంబ్రల్) దశతో ప్రారంభమవుతుంది. అయితే,

తరువాయి 2లో..

## రబీ నుంచి పకడ్బందీగా

# ఎరువుల పంపిణీ



**వెబ్‌ల్యాండ్, ఈ-క్రాప్, ఆధార్ అనుసంధానంతో సరఫరా**

**కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయ అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**మన ఉత్పత్తుల్ని అంతర్జాతీయ బ్రాండ్లుగా మార్చాలి**

**యువ పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు పిలుపు**

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రానున్న రబీ సీజన్‌లో వెబ్‌ల్యాండ్, ఈ-క్రాప్ అనుసంధానంతో, రైతుల ఆధార్‌కార్డుల ప్రాతిపదికన ఎరువులు సరఫరా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఎవరెంత పంట వేశారో.. ఈ-క్రాప్ నమోదుతో తెలుసుకొని ఆ మేరకు ఎరువులు ఇచ్చే వ్యవస్థ ఏర్పాటు కావాలని, అవసరమైతే డేటా అనుసంధానం చేయాలని సూచించారు. ఇప్పటి నుంచే ఇందుకు సమాయత్తం కావాలన్నారు. రాష్ట్రంలో ఎరువుల సరఫరా, లభ్యతపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయ అధికారులతో చంద్రబాబు శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయి నుంచి తెప్పించుకున్న సమాచారంతో అధికారులు ఇచ్చే నివేదికల్ని సరిపోల్చి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎరువుల సరఫరా

తరువాయి 2లో..

## సీడాప్ ద్వారా 50 వేల మందికి విదేశీ ఉద్యోగాల కల్పనే లక్ష్యం



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఏపీ రాష్ట్ర ఉద్యోగ కల్పన, వ్యవస్థాపకాభివృద్ధి సంస్థ(సీడాప్) ద్వారా 50వేల మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సీడాప్, ఇండోయూరో సింక్రనైజేషన్ అండ్ జర్మన్ హెల్త్‌కేర్ సంయుక్త భాగస్వామ్యంతో అమలు చేస్తున్న అంతర్జాతీయ ఉపాధి కల్పన పథకం కింద 14మంది నర్సింగ్, ఆరోగ్య సంరక్షణ నిపుణులకు జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తూ కాల్ లెటర్స్ అందాయి. కాల్‌లెటర్లు అందుకున్న అభ్యర్థులను శనివారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

తరువాయి 2లో..

# విజయవాడ ఉత్సవ్

**దసరా సందర్భంగా 22 నుంచి వేడుకలు**

**సినీ, సంగీత, సాంస్కృతిక, క్రీడోత్సవాలు**

**12 ఏళ్ల తర్వాత మళ్లీ ఎగ్జిబిషన్ ఆరంభం**

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

దసరా సందర్భంగా విజయవాడ ఉత్సవ్ పేరుతో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు విజయవాడ నగరంలో పెద్దఎత్తున వేడుకలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పర్యాటకానికి జవసత్వాలు అందించేలా.. ఈ వేడుకలను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రముఖ సినీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ శ్రేయాస్ మీడియా

తరువాయి 2లో..






# మార్చికల్లా అందుబాటులోకి టిడ్కో గృహాలు

**కర్నూలు, సిటిజన్ టైమ్స్**

రాష్ట్రంలోని 163 టిడ్కో గృహ సముదాయాలు మార్చి 31 నాటికి లబ్ధిదారులకు అందుబాటులోకి వస్తాయని పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. కర్నూలు శివారులోని జగన్నాథ గట్టు వద్ద నిర్మించిన టిడ్కో గృహాలను శనివారం ఆయన పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక

# ఎర్రకోటలో రూ.కోటి విలువైన బంగారు కలశాలు చోరీ




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఢిల్లీలోని ఎర్రకోటలో భారీ దొంగతనం జరగడం కలకలం రేపింది. ఇటీవల ఎర్రకోటలో జరిగిన ఓ మతపరమైన కార్యక్రమంలో రూ.కోటి విలువగల రెండు కలశాలు చోరీకి గురైనట్లు అధికారులు పేర్కొన్నారు. సెప్టెంబర్ 3న ఉదయం ఎర్రకోటలో ఓ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమం అనంతరం పూజ కోసం తాను తీసుకువచ్చిన 760 గ్రాములు బంగారు కలశం, వజ్రాలు, మాణిక్యాలు, పచ్చలతో పొదిగిన 115 గ్రాముల మరో చిన్న బంగారు కలశం కనిపించలేదని వ్యాపారవేత్త సుధీర్ కుమార్ జైన్ ఎర్రకోట నిర్వాహకులకు ఫిర్యాదు చేశారు. పూజా కార్యక్రమానికి ప్రముఖులు హాజరవ్వడంతో తాము పక్కకు వెళ్లామని.. అంతలోనే ఈ దొంగతనం జరిగిందని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు

తరువాయి 2లో..

## టారిఫ్‌ల వేళ.. ఐరాస సమావేశానికి

# మోదీ దూరం



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భారీ సుంకాల విధింపు నేపథ్యంలో భారత్-అమెరికా సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాలో జరగనున్న ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాని మోదీ హాజరు కావడం లేదని తెలుస్తోంది. సెప్టెంబరు 9 నుంచి ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 80వ

తరువాయి 2లో..

# దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్'

## కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు

**దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు ఈసీ ప్లాన్**

**ఈ నెల 10న రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులతో కీలక సమావేశం**

**ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాల క్షుణ్ణమైన పరిశీలన**


**అక్రమ వలసదారులను జాబితా నుంచి తొలగించడమే ప్రధాన లక్ష్యం**

**2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈసీ**

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) భారీ కసరత్తుకు శ్రీకారం చుట్టింది. బీహార్‌లో చేపట్టిన తరహాలోనే 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని దేశమంతటా అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఈ కీలక

తరువాయి 2లో..



## ఎడిటోరియల్

# వైసీపీ కంచుకోటని మంచుకోటని చేసే పనిలో బాబు !

వైసీపీకి అండగా నిలిచిన ప్రాంతం రాయలసీమ. అలాగే ఒక బలమైన సామాజిక వర్గం. జగన్ రాజకీయాల్లోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ నుంచి వేరు పడి సొంత పార్టీ పెట్టాక ఆయన వెన్నంటి ఉన్నది రాయలసీమ ప్రాంతం. అలాగే బలమైన సామాజిక వర్గం. అందుకే 2014లో వైసీపీ ఓటమి పాలు అయినా 67 అసెంబ్లీ సీట్లు సాధించి బలమైన ప్రతిపక్షంగా అసెంబ్లీలో నిలిచింది. ఇక 2019లోనూ రాయలసీమ మొత్తం జగన్ వైపు ఉండి వైసీపీ చెయ్యెత్తి జై కొట్టింది. ఫలితంగా మొత్తం రాయలసీమలోని నాలుగు జిల్లాలలో ఉన్న 52 అసెంబ్లీ సీట్లకు గానూ టీడీపీకి మూడంటే మూడు దక్కితే 49 సీట్లను వైసీపీ గెలుచుకుంది. ఇంతలా ఒక రాజకీయ పార్టీ పెర్ఫార్మ్ చేసింది గతంలో అయితే లేదు. అయితే 2024 నాటికి చూస్తే సీమ జిల్లాకు మొత్తం వైసీపీకి ఫేస్ టర్నింగ్ ఇచ్చుకున్నాయి. అలాగే వైసీపీనే నమ్ముకుని రెండు సార్వత్రిక ఎన్నికల్లో బలంగా నిలబడిన ఒక కీలక సామాజిక వర్గం సైతం మాకెందులు లెమ్మని పట్టనట్లుగా ఉండిపోయింది. దీంతో రాయలసీమలోని మొత్తం సీట్లలో ఏడంటే ఏడు మాత్రమే వైసీపీకి దక్కాయి. అలా కూటమి దెబ్బకు ఫ్యాన్ పార్టీ ఒక్క లెక్కన కుదేల్ అయిపోయింది. మరో వైపు చూస్తే కాంగ్రెస్ హయాంలోనూ ఇంకా చెప్పాలంటే వైసీపీ పుట్టాక గెలవని సీట్లలోనూ 2024 ఎన్నికల్లో గెలిచి సత్తా చాటింది. దాంతో టీడీపీకి సీమలో గ్రాఫ్ బాగా పెరిగింది. దానిని పదిలపరచుకునే పనిలో అపర చాణక్యుడు చంద్రబాబు ఉన్నారు. రాయలసీమలో కనుక వైసీపీ కూసాలు కదిలిస్తే మాత్రం 2029లోనూ అద్భుతమైన విజయాలు టీడీపీ కూటమికి దక్కుతాయని లెక్క వేస్తున్నారు. నిన్నటి దాకా వైసీపీ వెంట ఉంటూ అన్ని విధాలుగా అండగా నిలిచిన ఒక బలమైన సామాజిక వర్గాన్ని సైతం ఆకట్టుకునే పనిలో టీడీపీ ఉంది. ఇందులో చాలా వరకూ సక్సెస్ అయింది. ఇక కడపలో మహానాడుని టీడీపీ అత్యంత గ్రాండ్ గా నిర్వహించి జగన్ ఇలాకాలో తన తడాఖా చూపించింది. ఇక లేటెస్ట్ గా చూస్తే పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో గెలిచి వైసీపీని పూర్తిగా చతికిలపడేలా చేసింది. ఇపుడు రెట్టించిన ఉత్సాహంతో రాయలసీమ మీద ఫుల్ ఫోకస్ పెట్టేసింది. తాజాగా చూస్తే కనుక ఈ నెల 10న అనంతపురంలో సూపర్ సిక్స్ విజయోత్సవాలను నిర్వహించాలని టీడీపీ కూటమి నిర్ణయించింది. ఇక్కడ ఈ విజయోత్సవ సభను నిర్వహించడం ద్వారా రాయలసీమ మొత్తం కూటమి సక్సెస్ ని రీ సౌండ్ తో వినిపించాలని బాబు మాస్టర్ ప్లన్ నే వేశారు అని అంటున్నారు. ఈ రోజున చూస్తే వైసీపీకి జగన్ సొంత జిల్లా కడపలోనే ఇబ్బందికరమైన పరిస్థితి ఉందని అంటున్నారు. అనంతపురంలో చూస్తే టీడీపీ ఏకపక్షంగానే విజయాలు సాధిస్తోంది. అలాగే కర్నూల్, చిత్తూరు లో కూడా తన పట్టుని పెంచుకుంటూ వస్తోంది. వరసగా చంద్రబాబు లోకేష్ రాయలసీమ జిల్లాలలో పర్యటనలు చేస్తూ వస్తున్నారు. ప్రజలతో మమేకం అవుతున్నారు. బనకచర్ల ద్వారా సాగు నీటిని ఇస్తామని శాశ్వతంగా కరవు లేకుండా చూస్తామని చెబుతున్నారు. హార్టీ కల్చర్ హబ్ గానూ పారిశ్రామికంగానూ రాయలసీమను నిలుపుతామని చెబుతున్నారు. ఈ విధంగా వైసీపీకి హార్డ్ కోర్ రీజియన్ గా ఉన్న రాయలసీమలో వచ్చే ఎన్నికల్లో తమ హవా ఇదే తీరున కొనసాగిస్తే ఫ్యాన్ పార్టీకి రాజకీయంగా ఇబ్బందులే అన్నది టీడీపీ వ్యూహంగా కనిపిస్తోంది. అందుకే నిన్న కడపలో మహానాడుని నిర్వహించారు. ఈ నెల 10న అనంతపురంలో సూపర్ సిక్స్ విజయోత్సవాలకు వేదికగా ఎంపిక చేసుకున్నారు అని అంటున్నారు.

## రబీ నుంచి పకడ్బందీగా

# ఎరువుల పంపిణీ

సజావుగా సాగుతోందని, డిమాండ్ మేరకు రైతులకు అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. "జిల్లా కలెక్టర్ నుంచి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగి వరకూ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎరువుల సరఫరా పరిశీలించాలి. ఆందోళన తొలగించి రైతుల్లో భరోసా కల్పించాలి" అని చంద్రబాబు అన్నారు. బాపట్ల, కృష్ణా, వైఎస్సార్ కడప జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో కొరత ఉందని.. ఇతర ప్రాంతాల నుంచి ఎరువులు తెప్పించి సమస్య పరిష్కరిస్తున్నట్లు ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. "అన్ని జిల్లాల్లో కలిపి 77,396 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఆదివారం కాకినాడ పోర్టుకు 15,000 టన్నులు రానున్నాయి. ఇవి కాక మరో పది రోజుల్లో 41 వేల టన్నులు అదనంగా రానున్నాయి" అని సీఎంకు అధికారులు వివరించారు.

**యువ పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు పిలుపు**

రాష్ట్రానికి చెందిన యువ పారిశ్రామికవేత్తలు కొత్త రంగాల్లోకి అడుగుపెట్టి మన సత్తా చాటాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రభుత్వ విధానాలను వినియోగించుకుని అంతర్జాతీయ స్థాయికి మన సంస్థలు, ఉత్పత్తుల్ని తీసుకెళ్లాలని, 'ఆంధ్రా ప్రెన్యూర్స్' అనే పేరు నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఉండవల్లి నివాసంలో శనివారం ఆంత్రప్రెన్యూర్స్ ఆర్గనైజేషన్‌కు చెందిన పలువురు యువ పారిశ్రామికవేత్తలతో సీఎం సమావేశమయ్యారు. 'రాష్ట్రంలో వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలున్నాయి. అగ్రి ప్రాసెసింగ్, పర్యాటకం, డిఫెన్స్, స్పేస్, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్ ఇలా వేర్వేరు రంగాల్లో ఉన్న అవకాశాల్ని వినియోగించుకోండి. విశాఖ- చెన్నై మధ్య నాలుగు లేన్ల రైల్వేలైన్ ప్రాజెక్టుతో ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారతాయి. భవిష్యత్తులో అమరావతి- హైదరాబాద్- బెంగళూరు- చెన్నై దేశంలోనే అతిపెద్ద కారిడార్‌గా మారుతుంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. ఆయా పరిశ్రమలకు తగ్గట్టు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆయా దేశాల పేర్లను సూచించేలా పార్కులతో సుందరీకరణ చేపడుతున్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు. సమావేశంలో విశాఖ ఎంపీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్'

## కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు

కార్యక్రమం అమలు, విధివిధానాలపై చర్చించేందుకు ఈ నెల 10న అన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులతో (సీఈఓలు) ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత సీఈఓలతో నిర్వహిస్తున్న మూడో కీలక సమావేశం ఇది. ముఖ్యంగా 2026లో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితాను 100 శాతం కచ్చితత్వంతో, పారదర్శకంగా తీర్చిదిద్దాలని ఎన్నికల సంఘం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా ఈ సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటీవల బీహార్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియను మరింత పకడ్బందీగా, పక్షపాతరహితంగా నిర్వహించేందుకు ఈసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా బంగ్లాదేశ్, మయన్మార్ వంటి దేశాల నుంచి వలస వచ్చి అక్రమంగా ఓటరు జాబితాల్లో చేరిన వారిని గుర్తించి తొలగించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశాలలో ఒకటి. ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడటంతో పాటు, బోగస్ ఓట్లకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని ఈసీ భావిస్తోంది. ఈ బృహత్తర కార్యక్రమం విజయవంతం కావాలంటే రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాల పూర్తి సహకారం అత్యంత అవసరమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# విజయవాడ ఉత్సవ్

ఆధ్వర్యంలో విజయవాడలోని కృష్ణానదీ తీర ప్రాంతం, తుమ్మలపల్లి కళాక్షేత్రం, గొల్లపూడిలోని ఎగ్జిబిషన్ మైదానం, ఘంటసాల సంగీత కళాశాల, ఇందిరాగాంధీ మైదానాల్లో సినీ, సంగీత, సాంస్కృతిక, క్రీడలకు సంబంధించిన కార్యక్రమాలను నిరంతరాయంగా 11రోజులు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా కృష్ణా నదిలో పడవల పోటీలు ఉంటాయి. జలక్రీడలు, డ్రోన్ షో, కిడ్స్ జోన్స్, అమ్యూజ్‌మెంట్ పార్క్, దుకాణ సముదాయాలు ఏర్పాటు చేయనున్నారు. పున్నమిఘాట్ వద్ద నిత్యం దేశంలోని ప్రముఖ మ్యూజిక్ బ్యాండ్ల ప్రదర్శనలు, ప్రముఖ సినీ నేపథ్య గాయకులు, జానపద కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. రోజూ ప్రకాశం బ్యారేజీపై బాణసంచా వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సాంస్కృతిక నృత్య, కళా ప్రదర్శనలు, నాటకాలు, బుర్రకథలు, ప్రవచనాలు కొనసాగనున్నాయి. 12 ఏళ్ల తర్వాత మళ్లీ విజయవాడ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గొల్లపూడిలోని ఎగ్జిబిషన్ మైదానంలో స్టాళ్లతోపాటు వేదికపై ప్రతిరోజూ ఒక్కో సినీ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 22న ఓజీతో ఆరంభించనున్నారు. ఆ తర్వాత అఖండ-02, మన శంకరవరప్రసాద్‌గారు సినిమాల ప్రత్యేక పాటల విడుదల కార్యక్రమాలు, మ్యూజికల్ కాన్సర్ట్‌లు, లోకల్ డ్యాన్సర్లు, బ్యాండ్ల ప్రదర్శనలు జరగనున్నాయి. రోజూ ప్రముఖ సినీ నటులు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

**మిస్ విజయవాడ, మారథాన్..**

ఉత్సవాల్లో భాగంగా మిస్ విజయవాడ, యువ గాయకులకు విజయవాడ ఐడల్ పోటీలు నిర్వహించనున్నారు. నగరంలో 2కే, 5కే, 20కే మారథాన్ రన్‌లు, హెలికాప్టర్, హాట్ ఎయిర్ బెలూన్ రైడ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అగ్ని అవార్డుల పేరుతో.. సినీ పురస్కారాలతోపాటు సోషల్ మీడియా అవార్డులు ఇవ్వనున్నారు. దసరా ఉత్సవాల్లో విజయవాడకు ఏటా 10-15 లక్షల మంది భక్తులు వస్తుంటారు. దుర్గమ్మను దర్శించుకుని వెళ్లిపోవడమే తప్ప, వారికి మరే ఆకర్షణాలేదు. మైసూరు దసరా ఉత్సవాల తరహాలో విజయవాడలోనూ ఇకపై ఏటా అంగరంగ వైభవంగా ఉత్సవ్ నిర్వహించబోతున్నామని.. ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చేవారు కనీసం రెండు రోజులు ఉండి.. విజయవాడ ఉత్సవ్ తిలకించి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు.

# సీడాప్ ద్వారా 50 వేల మందికి విదేశీ ఉద్యోగాల కల్పనే లక్ష్యం

"తొలి బ్యాచ్‌లో సీడాప్ ద్వారా 171 మందికి శిక్షణ ఇవ్వగా ఇప్పటికే వివిధ విభాగాల్లో 40 మంది ఎంపికయ్యారు. మరో 14మంది త్వరలోనే జర్మనీ వెళ్తున్నారు. మిగతా వారికీ ఉద్యోగాలు లభిస్తాయి. అంతర్జాతీయ అవకాశాలను మన విద్యార్థులు అందిపుచ్చుకునే విధంగా సీడాప్-ఓంక్యాప్ ద్వారా విదేశీ భాషలపై శిక్షణ ఇస్తున్నాం. చదువుతోపాటు విదేశీ భాషల్లో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకున్నాం. జర్మనీలో కొలువులు పొందిన ఒక్కొక్కరు మరో పదిమంది ఉద్యోగాలు సాధించేలా మార్గదర్శకం చేయాలి. ఈ నెలలో నైపుణ్య పోర్టల్‌ను ప్రారంభించబోతున్నాం. సమాజాభివృద్ధిలో మహిళా సాధికారత కీలక పాత్రపోషిస్తుంది. మహిళలను కించపర్చే సినిమాలను సైతం విడుదల కాకుండా అడ్డుకోవాలన్నదే తమ అభిమతం" అని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను మంత్రి లోకేశ్ సన్మానించారు. వారికి ట్యాబ్‌లు అందించారు.

రూ.2.8లక్షల ఉద్యోగం కలగా ఉంది..: బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసి, స్థానిక ఆసుపత్రుల్లో నెలకు రూ.15వేల నుంచి రూ.20వేలకు పని చేసే తమకు జర్మనీలో రూ.2.8లక్షల వేతనంతో ఉద్యోగం లభించడం కలగా ఉందని పేర్కొంటూ అభ్యర్థులు భావోద్వేగానికి గురయ్యారు. ఉద్యోగాలు సాధించిన 14మందిలో 9మంది నిరుపేద ఎస్సీ కుటుంబాలకు చెందిన వారు కాగా.. ముగ్గురు బీసీలు ఉన్నారు. జర్మనీలో ఇవే ఉద్యోగాల కోసం కన్సల్టెన్సీలను శిక్షణ కోసం సంప్రదిస్తే రూ.8 లక్షల వరకు అడిగారని, అంత డబ్బు చెల్లించే ఆర్థిక స్తోమత తమకు లేదని పేర్కొన్నారు. సీడాప్ ద్వారా ఒక్క రూపాయి తీసుకోకుండా జర్మన్ భాషలో శిక్షణ ఇచ్చి, ఉద్యోగం వచ్చేలా చేశారని తెలిపారు. తమ కలను సాకారం చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఈ కార్యక్రమంలో సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి, సీఈఓ నారాయణస్వామి, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# మార్చికల్లా అందుబాటులోకి టిడ్కో గృహాలు

సదుపాయాలతో పాటు పాఠశాలలు, కార్యాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో మరో 70 అన్న క్యాంటీన్లు రాబోతున్నాయన్నారు. కర్నూలు టిడ్కో గృహ సముదాయాల వద్ద రూ.కోటి వ్యయంతో తాగునీటి వసతి కల్పిస్తామని, సౌకర్యాల కల్పనకు రూ.5 కోట్లు మంజూరు చేయిస్తామనిప్రకటించారు. ఇక్కడి 3,056 గృహాలను డిసెంబరు నాటికి పూర్తి చేస్తామన్నారు. సమీపంలో పదెకరాల స్థలాన్ని పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు.

# ఎర్రకోటలో రూ.కోటి విలువైన బంగారు కలశాలు చోరీ

ఘటనా స్థలంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా.. ఎవరూ లేని సమయంలో ఓ వ్యక్తి పూజాసామగ్రి ఉన్న గదిలోకి వెళ్లి.. రెండు కలశాలను సంచిలో వేసుకుంటున్న దృశ్యాలు కనిపించాయి. అనంతరం అతడు అక్కడి నుంచి బయటకు జారుకున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దీంతో కేసు నమోదు చేసి.. గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై ఇప్పటికే పలు ఆలయాల్లో దొంగతనానికి యత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. కలశాలను దొంగలిస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# టారిఫ్‌ల వేళ.. ఐరాస సమావేశానికి మోదీ దూరం

సెషన్ ప్రారంభమవుతుంది. 23 నుంచి 29 వరకు సర్వసభ్య దేశాల ప్రతినిధుల అత్యున్నత స్థాయి సమావేశాలు జరుగుతాయి. ఇందులో బ్రెజిల్ దేశాధినేత ప్రసంగంతో సమావేశాలు మొదలవుతాయి. అనంతరం అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ మాట్లాడతారు. తర్వాత భారత మంత్రి ప్రసంగం ఉంటుందని ఐరాస తన షెడ్యూల్‌లో పేర్కొంది. దీని ప్రకారం యూఎన్ సమావేశాలకు మోదీ దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన స్థానంలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ప్రసంగించనున్నారని సమాచారం. ఇది తుది షెడ్యూల్ కానందున సమావేశాల ప్రారంభానికి ముందు కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది. ఇజ్రాయెల్, చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాధినేతలు కూడా సమావేశాల్లో ప్రసంగించనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మోదీ అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రష్యా (%ష్త్రతిరీరీరిబి%) నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారంటూ.. ట్రంప్ ఇటీవల భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. దీంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో మోదీ యూఎన్ సమావేశాలకు కూడా దూరం కానుండటం గమనార్హం.

# నేడు ఆకాశంలో 'బ్లడ్ మూన్'...

స్పష్టమైన మార్పులు రాత్రి 9:57 గంటలకు పాక్షిక గ్రహణం మొదలైనప్పటి నుంచి కనిపిస్తాయి. అసలైన అద్భుతం రాత్రి 11:00 గంటలకు సంపూర్ణ గ్రహణం ప్రారంభంతో మొదలవుతుంది.

రాత్రి 11:00: సంపూర్ణ గ్రహణం ప్రారంభం (చంద్రుడు పూర్తిగా ఎర్రగా మారడం మొదలవుతుంది)

రాత్రి 11:41: గ్రహణం గరిష్ఠ స్థాయి (చంద్రుడు అత్యంత ఎర్రగా కనిపించే సమయం)

రాత్రి 12:22: సంపూర్ణ గ్రహణం ముగింపు

రాత్రి 1:26: పాక్షిక గ్రహణం ముగింపు

రాత్రి 2:25: గ్రహణం పూర్తిగా ముగుస్తుంది

అంటే, చంద్రుడిని పూర్తి ఎరుపు రంగులో చూసేందుకు రాత్రి 11:00 గంటల నుంచి ఉదయం 12:22 గంటల మధ్య సమయం అత్యంత అనువైనది.

**ఎక్కడ నుంచి స్పష్టంగా చూడొచ్చు?**

హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా వంటి అన్ని ప్రధాన నగరాల్లో ఈ గ్రహణం కనిపిస్తుంది. అయితే, నగరాల్లోని కాంతి కాలుష్యం, దుమ్ము, ధూళి వీక్షణకు కొంత ఆటంకం కలిగించవచ్చు. అత్యంత స్పష్టంగా, అద్భుతంగా ఈ దృశ్యాన్ని వీక్షించాలంటే నగరం వెలుపల, గాలిలో తేమ తక్కువగా ఉండి, ఆకాశం నిర్మలంగా ఉండే ప్రదేశాలు ఉత్తమం. హిమాచల్ ప్రదేశ్‌లోని స్పితి వ్యాలీ, లడాఖ్‌లోని నుబ్రా వ్యాలీ, రాజస్థాన్‌లోని సరిస్కా, గుజరాత్‌లోని రాణ్ ఆఫ్ కచ్, కర్ణాటకలోని కూర్గ్ వంటి ప్రదేశాలు ఈ ఖగోళ అద్భుతాన్ని వీక్షించడానికి అద్భుతంగా ఉంటాయి.

**ఎలా చూడాలి? జాగ్రత్తలేంటి?**

సూర్యగ్రహణంలా కాకుండా చంద్రగ్రహణాన్ని నేరుగా కళ్లతో చూడటం పూర్తిగా సురక్షితం. ఎలాంటి ప్రత్యేక కళ్లద్దాలు అవసరం లేదు. బైనాక్యులర్లు లేదా టెలిస్కోప్ ద్వారా చూస్తే చంద్రుడి ఉపరితలంపై మార్పులు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. ఫొటోగ్రఫీపై ఆసక్తి ఉన్నవారు ట్రైపాడ్ ఉపయోగించి కెమెరాతో ఈ అద్భుత దృశ్యాలను బంధించవచ్చు. స్టెల్లారియం, స్కైసఫారీ వంటి స్మార్ట్‌ఫోన్ యాప్‌ల సహాయంతో ఆకాశంలో చంద్రుడి కదలికలను సులభంగా గమనించవచ్చు.

# అభివృద్ధి పరుగులు పెట్టాలి...

## మహానగరం ఖ్యాతి మరింత పెరగాలి...

**విశాఖపట్టణం డీఆర్సీ సమావేశంలో**

**మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి**

**పలు అంశాలపై కలెక్టరేట్లో సుదీర్ఘంగా**

**సాగిన సమీక్ష, భాగస్వామ్యమైన ప్రజా ప్రతినిధులు**

**పారిశుద్ధ్యానికి పెద్దపీట వేయాలని, తాగునీటి**

**నిల్వ సామర్థ్యాలను పెంచాలని సూచనలు**

**క్లీన్ సిటీ, స్మార్ట్ సిటీ అయిన విశాఖ ప్రగతిపై**

**అధికారులు దృష్టి సారించాలని మంత్రి నిర్దేశం**



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 06:**
క్లీన్ సిటీ, స్మార్ట్ సిటీ అయిన విశాఖ మహానగరం అభివృద్ధిపై అధికార యంత్రాంగం ప్రధాన దృష్టి సారించాలని, ఖ్యాతి మరింత పెరిగేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, సరైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని నిర్దేశం చేశారు. సుందరీకరణ, విద్యుదీకరణ, పట్టణీకరణ మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో శనివారం జరిగిన జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశంలో పలు అంశాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. డీఆర్సీలో ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేశ్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవాట్రస్టు ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, ఏపీ గ్రోవర్స్ ఆయిల్స్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండిబాబ్జీ, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, డీసీపీ మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ మాధుర్, సీపీవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలు....



"ఏళ్ల తరబడి పినగాడి రోడ్డుకు పరిష్కారం దొరకలేదు. ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వీఎంఆర్డీఏ, జీవీఎంసీ అధికారులు సమన్వయం చేసుకొని వేగవంతంగా పనులు పూర్తి చేయాలి. నగరానికి అనుసంధానమై ఉన్న కొన్ని గ్రామీణ ప్రాంతాలను కార్పొరేషన్ పరిధిలో విలీనం చేస్తే మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయి" అని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు ప్రతిపాదించారు. దీనిపై స్పందించిన మంత్రి సబ్ కమిటీకి నివేదిస్తామని చెప్పారు.



"టిడ్కో గృహాల విషయంలో మరింత చొరవ చూపాలి. బిల్లుల చెల్లింపులు, మౌలిక వసతుల కల్పనలో వేగం పెరగాలి. 26, 43, 46, 47 వార్డులలో జీవీఎంసీ గోస్ట్ వర్కర్లు ఉన్నారు.. వారిపై చర్యలు తీసుకోవాలి. తాడిచెట్లపాలెం – ధర్మానగర్ – కంచరపాలెం మెట్టు మార్గంలో ఇప్పటికీ విద్యుద్దీపాలు లేవు" అని ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రస్తావించారు.




"పోర్టు, రైల్వే, డిఫెన్స్ ఏరియాల నుంచి ప్రజా ప్రాంతాల్లోకి వస్తున్న మురుగు నీటి కాలువల వల్ల ఇబ్బందులు ఉన్నాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒక కమిటీ వేసి సమస్యను పరిష్కరించాలి. టిడ్కో గృహ లబ్ధిదారులకు రుణాలిచ్చేందుకు ప్రయివేటు బ్యాంకులు అనాసక్తి చూపుతున్నాయి. డీసీసీబీ ద్వారా రుణాలు అందిస్తే బాగుంటుంది. ప్రభుత్వ పాలసీలు, విధానాలపై, కొత్తగా వచ్చే ఆదేశాలపై, జీవోలపై సచివాలయం సిబ్బందికి అవగాహన ఉండటం లేదు. పేదలకు అందించిన కన్వేయన్స్ డీడ్ పట్టాలకు రిజిస్ట్రేషన్లు వేగవంతంగా జరిగేలా చూడాలి" అని ప్రభుత్వ విప్ గణబాబు పేర్కొన్నారు.




"నగరంలో చాలా చోట్ల డ్రెయిన్లు ఆక్రమణలకు గురయ్యాయి. వాటిలో చెత్తా చెదారం వేయటం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వర్షపు నీరు పారక రోడ్లు జలమయమవుతున్నాయి. దీని వల్ల అపరిశుభ్రత ఏర్పడుతుంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. చర్యలు చేపట్టాలి" అని విశాఖ ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ స్పందిస్తూ 250 ఆక్రమణలను గుర్తించామని, నెల రోజుల్లో చర్యలు తీసుకుంటామని చెప్పారు.




"జీవీఎంసీ జోన్ -4 పరిధిలో పలువురు పనికి రాకుండా జీతాలు తీసుకుంటున్నారు. దీనిపై సంబంధిత జోనల్ కమిషనర్ కు నివేదిక ఇచ్చినా చర్యలు తీసుకోలేదు. పారిశుద్ధ్య నిర్వహణలో క్షేత్రస్థాయి పరిస్థితులు బాగోలేదు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి. సచివాలయాల్లో కంప్యూటర్లు, ఇతర పరికరాలు సమకూర్చాల్సి ఉందని, దేవాదాయ శాఖ పరిధిలో భూముల క్రమబద్దీకరణ అంశాలకు పరిష్కారం చూపించాల్సి ఉంది" అని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు.



జీవీఎంసీ పరిధిలో ఆప్కోస్ ద్వారా నియామకాలు చేపడితే చాలా మందికి ప్రయోజనం కలుగుతుంది. సర్వే విధానంలో పారదర్శకత పెరగాలి. స్కెచ్ రూపంలో సర్వే రిపోర్టులు ఇవ్వాలి. చిన్నపిల్లలున్న తల్లులకు జీవీఎంసీలో రాత్రి విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి. దువ్వాడ – కూర్మన్నపాలెం రోడ్డు విస్తరణలో భాగంగా ఆస్తులు కోల్పోయిన వారికి టీడీఆర్లు ఇవ్వాలి. స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను బలోపేతం చేయాలి. కూర్మన్నపాలెం డిపో తరలింపు, ప్రత్యామ్నాయ స్థలం వినియోగం, స్టీల్ ప్లాంట్ పరిధిలోని ఆర్-బీ రోడ్లకు సూచిక బోర్డుల ఏర్పాటు తదితర అంశాల్లో అధికార యంత్రాంగం జాగ్రత్తగా వ్యవహరించాలని" గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచించారు.



"పారిశుద్ధ్యం అస్సలు బాగోలేదు. తాగునీరు సరఫరా సరిగ్గా ఉండటం లేదు. వీధి దీపాలు వెలగటం లేదు. జాతీయ రహదారి క్రాస్ అవుతున్న చోట్ల డ్రెయినేజీ కాలువల్లో ఇబ్బందులు ఉంటున్నాయి. ఆధునిక పరిజ్ఞానం ద్వారా సమస్యకు పరిష్కారం చూపించాలి. సచివాలయ సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడింది. జీవో నెం.296 ప్రకారం ఇది వరకు ఇచ్చిన పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయకపోవటం, క్రమబద్దీకరించకపోవటం విచారకరం" అని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. నీటి నిల్వ సామర్థ్యాలను పెంచేందుకు సింటాక్స్ ట్యాంకులను అభివృద్ధి చేయాలని, ముడసర్లోవ రిజర్వాయర్ ను విస్తరించాలని సూచించారు.సింహాచలం దేవస్థానం పరిధిలో వర్షాలు వలన ఇళ్ళు పడిపోయిన, పాక్షికంగా దెబ్బ తిన్న వారికీ నిర్మించుకోవడానికి పర్మిషన్లు ఇవ్వాలి అని సూచించారు.

# లక్ష్య సాధనలో ఎదురయ్యే అవరోదారను ఎదరిస్తే విజయం మీ సొంతం అవుతుంది






**భీమిలి, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 06:**

అవంతి ఇంజినీరింగ్ కళాశాల తగరపువలసలో అవంతి సంస్దులు ఆద్వర్యం లో లక్ష్య చేదనలో విజ యోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించచడం జరిగింది అవంతి కళాశాల లో విద్యను అభ్యసించి అనంతరం ఉద్యోగాలు చేస్తూ స్థిర పడిన వారికి అవంతి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంకి అవంతి సంస్థల అదినేత మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు – విజయనగరం జె.యన్.టి.యు కళాశాల వైస్ ఛాన్సలర్ గా.డి.రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిలుగా హాజరైనారు అవంతి – వైస్ ఛాన్సలర్ రాజ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు అవంతి కళాశాల లలో చదువుకుని 2025వ సంలో వివిద కంపెనీలలో ఉద్యోగాలు పొందిన 1,110 మందికి అపాయింట్మెంట్ లెటర్ లు అవంతి మరియు వైస్ ఛాన్సలర్ రాజ్యలక్ష్మి చేతులు మీదుగా అంది వ్వడం చేసారు ముఖ్య అతిథి వైస్ ఛాన్సలర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జీవితంలో ప్రతీ ఒక్కరు ఉన్నత స్థాయికి వెళ్ళాలనే లక్ష్యాన్ని కలిగి ఉండాలని అవంతి కళాశాలలో చదివిన వారిలో ఈరోజు ఇంత మంది ఉన్నత స్థాయి లో ఉండటం దీని వెనుక మీ తల్లితండ్రులు మీ కృషి అవంతి కశాశాల క్రమ శిక్షణతో కూడిన విద్యా బోధన అని,రాబోయే తరా లకు మీరే ఒక స్పూర్తిగా నిలవాలి అన్నారు అనంతరం అవంతి విద్యా సంస్థల అధినేత ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతీ మనిషికి తాను అనుకున్నది సాదించాలనే తపన ఉంటుంది కానీ అలా అనుకున్న వారిలో కొంతమంది మాత్రమే తాము అనుకున్న లక్ష్యం వైపు నిష్టగా పయనించి చివరకు విజయం సాధిస్తారని కొంద రైతే లక్ష్య సాధనలో ఎదు రయ్యే అవరోదాలకు భయ పడి కనీసం చేయాల్సిన పనిని కూడా చేయకుండా అనువైన మార్గం గురించి ఆలోచించకుండా అపజయా లను చూస్తారని,లక్ష్య సాధన అనేది అంత సులు వైనదేమీ కాదని,అనుకూలత కాకుండా ప్రతికూల పరిస్థితులే లక్ష్య సాధనకు అవరోధాలుగా ఉంటాయని,ఎన్నో అవరోధా లను అదిగమించాల్సి ఉంటుందని ఆత్మ విశ్వాసం తో ముందుకు సాగి అదిగ మించిన వారే మీలా విజయం పొందుతారని,మీ విజయం ఇక్కడితో ఆగి పోకుండా ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నా సరే ప్రతీ రోజూ ఇంకా ఎదగాలనే ఆలోచన గాని – కొత్తగా ఏదైనా నేర్చుకోవాలనే తపన గాని – ఏదైనా సాదించాలనే ఆశయం గాని మీలో ఏకోశాన తాగకండా గురి యెద్దకు ముందుకు సాగిలని,ఎంత ఉన్నత స్థాయికి వెళ్ళినా సొంత ఊరిని పెంచిన తల్లి దండ్రులును మరిచిపో కూడదని,మీరే కాక మీతోటి వారికి సహాయం అందించే ఉన్నతమైన వ్యక్తిత్వం లక్షణాలు కలిగి ఉండాలని మాట్లాడారు అనంతరం ముఖ్య అతిథులును కశాశాల సిబ్బందిని అవంతి ఘనంగా సన్మానించి మెమోం టోలు అందించారు ఈ కార్య క్రమంలో అవంతి కళాశాలల ప్రిన్సిపాల్ష్ – డైరెక్టర్ లు – అధ్యాపకులు పాల్గొన్నారు.

## జామిగూడాపంచాయతీ 14 గ్రామాలప్రజలు టిడిపిలో చేరేందుకు సంసిద్ధం.



**అరకు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 06:**

పెదబయలు మండలం,జామిగూడా పంచాయతీ 14 గ్రామాల నాయకులు కార్యకర్తలు ప్రజలు స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడుస్తున్నా,జామిగూడ పంచాయతీ అభివృద్ధి శూన్యమని,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తితో, తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరుగుతుందని, తెలుగుదేశం పార్టీలో చేరెందుకు సిద్ధంగా ఉన్నామని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వెచ్చింగి. కొండయ్య , మండల ప్రధాన కార్యదర్శి కొర్రా. రాజారావు, తెలుగుదేశం పార్టీ గంపరాయి సూపర్ సర్పంచ్ బోర్గం. అప్పారావు ఎంపీటీసీల పోరం అధ్యక్షులు బొంజుబాబుగారు, క్లస్టర్ ఇంచార్జి వినోద్ , జామిగూడ గ్రామ కమిటీ అధ్యక్షులు వడ్డే. బాబురావు సమక్షంలో జామిగూడ లో సమావేశం ఏర్పాటు చేసారు, ఈ సమావేశంలో ఫాస్టర్ కొర్రా. గణపతి , అర్జున్ , కామేష్ , గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు, సభ అనంతరం కోజిరిగూడ, పినరవెల్లి గ్రామాలలో సందర్శించారు, ఆయా గ్రామాల ప్రజలు బీటి రోడ్లు మంజూరు చేయాలనీ, తెలుగుదేశం పార్టీ మండల నాయకులను విజ్ఞప్తి చేశారు,వారు స్పందించి రోడ్డు మంజూరు చేసేందుకుకృషి చేస్తామని అన్నారు.

## సబ్ జైలు నుంచి తప్పించుకున్న ఖైదీలు దొరికారు



**సీతమ్మ దార, సిటిజన్ టైమ్స్,: సెప్టెంబర్ 6**


సిటీ టాస్కోర్స్ పోలీసులకు చిక్కిన ఇద్దరు ఖైదీలు చోడవరం సబ్ జైలు నుంచి శుక్రవారం పరారైన ఇద్దరు ఖైదీలను విశాఖ సిటీ టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. చోడవరం సబ్ జైలులో ఖైదీలుగా ఉన్న బెజవాడ రాము, నక్క రవికుమార్ జైలు వార్డెన్ పై దాడి చేసి తప్పించుకున్న విషయం తెలిసిందే. వీరిద్దరూ సిటీలో కాంప్లెక్స్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో సీ.ఐ భాస్కరరావు, అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పట్టుకున్నారు. అనంతరం వీరిని చోడవరం పోలీసులకు అప్పగించారు.

# చింతపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.

### చింతపల్లి సర్పంచ్ పుష్పలత, టిడిపి మండల అధ్యక్షుడు పూర్ణచందర్రావు.

**చింతపల్లి, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 06**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చింతపల్లి మండలంలో ఘనంగా జరిగింది. స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, టిడిపి మండల అధ్యక్షుడు కిలో పూర్ణచందర్రావు ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ ఆనంద్ పర్యవేక్షణలో మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ డిఆర్ డిపో, అలాగే లమ్మసింగి పంచాయతీ కేంద్రంలోని డియర్ డిపో వద్ద లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుష్పలత మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ స్మార్ట్ రేషన్ కార్డులు ప్రజలకు పారదర్శకంగా సబ్సిడీ సరుకులు అందించడమే కాకుండా, వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి పొందేలా చేయడం శుభ పరిణామం అని తెలిపారు. టిడిపి మండల అధ్యక్షుడు పూర్ణచందర్రావు మాట్లాడుతూ స్మార్ట్ కార్డులు వలన లబ్ధిదారులు తక్షణమే తమ హక్కులను పొందగలరని, అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా చేస్తాయని అన్నారు. కార్డులు పొందిన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ సదుపాయం ద్వారా తాము త్వరితగతిన నిత్యావసర సరుకులు, అలాగే ప్రభుత్వం అందించే పథకాలను సులభంగా



పొందగలమని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు పేదల ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, సామాజిక సమానత్వానికి దోహదం చేస్తాయని ప్రజలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, ఎస్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి, గోపినాయక, త్రినాధ్, లక్కోజు నాగభూషణం, టిడిపి చింతపల్లి ఐటీడీపీ ఇన్చార్జి వరికోటి మహేంద్ర, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు కిముడు కృష్ణమూర్తి, టిడిపి మండల ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య, వీఆర్వోలు, వీఆర్ఏలు, స్మార్ట్ రేషన్ కార్డుల లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ.



**డుంబ్రిగుడ,సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 07 :**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో శనివారం ప్రారంభించారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమానికి స్థానిక టిడిపి నాయకులు పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం రేషన్ బియ్యంతో పాటు ఇతర నిత్యవసర సరుకులు పొందేందుకు ఈ స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే ఈ స్మార్ట్ రేషన్ కార్డులో క్యూఆర్ కోడ్ ఉంటుందని ఈ క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల వివరాలతో పాటు బియ్యం తీసుకున్నారా లేదా అని తెలుస్తుందన్నారు. అంతే కాకుండా ఎటువంటి అక్రమాలకు జరిగేందుకు వీలు లేదని చెప్పారు. మండలంలోని అందరి లబ్ధిదారులకు సచివాలయం సిబ్బంది, రేషన్ డీలర్లు సమన్వయంతో వారం రోజులోగా పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ త్రివేణి, డిప్యూటీ తహసిల్దార్ చంద్రశేఖర్, ప్రశాంత్, టిడిపి నాయకులు టి సుబ్బారావు, ఎం స్వామి, దన్నేరావు, భీమరాజు, సచివాలయం సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్న ప్రసాద వితరణ



**గాజువాక, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 06:**

గరుడాద్రి కొండపై వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్న ప్రసాద వితరణ ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో ఆలయ సేవకులు వారి ఆర్థిక సహాయంతో అన్న ప్రసాద వితరణ జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఉత్తర ద్వారంలో వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి వాంబే కాలనీ వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఏడు వారాలు నిష్టతోతో పూజ చేసి ఏడు ప్రదర్శనలు స్వామి వారి ఆలయం చుట్టూ తిరిగి ప్రదర్శలు చేసి స్వామివారిని కోరిన కోర్కెలు తీర్చుతారని భక్తులకు ప్రగాఢ నమ్మకం. ఆలయ ప్రధాను అర్చకులు చామర్తి శ్రీనివాస ఆచార్యులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకములు నిర్వహించారు. పులి జ్యోతి వారి బృందం విష్ణు సహస్రనామాలు పారాయణం జరిపించారు.ఇటీవల కురిసిన వర్షాలకు ఆలయ రిటైనింగ్ వాల్ , వంటశాల, స్వామి వారి దేవ ధూప నైవేద్యాలశాల, భోజనశాలకూలిపోవడం జరిగినది. పునర్నిర్మాణము కొరకు విరాళాలు ఇచ్చే దాతలు ఆలయ కమిటీ వారిని సంప్రదించవలసిందిగా కోరడమైనది .ఈకార్యక్రమంలో మిత్తన అప్పల రెడ్డి లక్ష్మి దంపతులు,పెంటకోట రాజు, సావిత్రమ్మ, లక్ష్మమ్మ,హిమాజా,పద్మ,మంగా, చిన్నమ్మ, శోభ, దుర్గ మరియు ఆలయ కమిటీ సభ్యులు ఆలయ పోషకులు ఆలయానికి ఆర్థికంగా సహాయం చేసిన భక్తులందరూ పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

### జనసేన పెదబరడ పంచాయతీ అధ్యక్షుడు రామకృష్ణ



**చింతపల్లి సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 6**

గ్రామంలో లేదా తమ ఇంటి పరిసరాలలో పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని జనసేన పెదబరడ పంచాయతీ అధ్యక్షుడు కూడ రామకృష్ణ అన్నారు. శనివారం లోతుగడ్డ జంక్షన్ మార్కెట్ పరిసరాలలో ఆయన ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి కుమార్ ల సూచనలతో స్థానిక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో పారిశుద్ధ్య పనులను నిర్వహింపజేశారు. అందులో భాగంగా మార్కెట్ వద్ద పేరుకుపోయిన చెత్తను పరిశుభ్రం చేసి దానిపై బ్లీచింగ్ ను వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, మన పరిసరాలు బాగుంటేనే మనము ఆరోగ్యంగా ఉంటామని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అప్పుడే స్వచ్ఛంధ్ర లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. గృహస్తులు చెత్తను బయట ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా విధిగా చెత్త కుండీలను వినియోగించాలని, ఒకేసారి చెత్తను గ్రామానికి అవతల పంచాయితీ నిర్దేశించిన ప్రదేశంలోనే చెత్తను పారవేయాలని ఆయన ప్రజలకు సూచించారు. అలాగే ఇంటి పరిసరాలలో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఏసుబాబు, దారబాబు, సకల గుణశేఖర్, సంపరి రాము, స్థానిక వార్డ్ నెంబర్ సంపరి నాగరాజు, ఆసీలుదారుడు గెమ్మెలి క్రిష్ణ, గెమ్మెల్లి రమణ, పాతుని సత్తిబాబు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కార్డులతో అక్రమాలకు చెక్..

### – తెలుగుదేశం పార్టీ యువ నాయకులు జగన్ బాబు..



**అనంతగిరి సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06**

నిత్యావసర సరుకుల పంపణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం స్మార్ట్ కార్డు విధానం ప్రవేశ పెట్టిందని అనంతగిరి మండలం టి డి పి యువ నాయకులు పొండోయి జగన్ బాబు అన్నారు.శనివారం అనంతగిరి రెవెన్యూ కార్యాలయంలో సుమారు 50 మంది రైతులకు స్మార్ట్ కార్డులను ఎంపీడీవో ప్రభాకర్, రెవెన్యూ అధికారి వీరభద్ర చారి, ఎంపీపీ నీలవేణి,జడ్పిటిసి గంగరాజు,డిప్యూటీ తాసిల్దార్ మాణిక్యం,జనసేన మండల అధ్యక్షుడు మురళి,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు దయానిది,శ్యామ్ కుమార్,జోగులు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జగన్ బాబు మాట్లాడుతూ క్యూర్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డు వల్ల పౌర సరఫరాల వ్యవస్థలో పాదదర్శకత కూటమి ప్రభుత్వం తీసుకు రానున్నారన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**అల్లిపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 06:**

తనకు ప్రజల సంక్షేమమే ముఖ్యమని వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు తెలిపారు పుష్పవతి అయిన ఇద్దరు అమ్మాయిలకు టూ టౌన్ సీఐ ఎర్రం నాయుడు చేతుల మీదుగా వెండి పట్టీలు,పట్టు చీరలు,పసుపు కుంకుమ అందజేశారు వీరిలో 32వ వార్డు అల్లిపురం ఎల్లపు వారి వీధి ప్రాంతానికి చెందిన లలిత, 33వ వార్డు,ఎంజీఎం స్కూల్ సమీపంలో గల కె.వర లక్ష్మి ఉన్నారు ఈ సందర్భం గా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ కే ఎన్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టడం జరిగిందన్నారు పేద విద్యార్థులకు,వికలాంగు లకు వృద్ధులకు,వితంతు వులకు ఇలా ఎంతోమందికి తన పరిధి మేరకు సహాయం చేస్తూ వస్తున్నానని వెల్ల డించారు ఒకపక్క రాజకీయ నాయకుడిగా సేవలు అందిస్తూనే మరోపక్క సంఘ సేవకులుగా ప్రజలకు చేరువై తన పరిధి మేరకు సహాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు టూ టౌన్ సీఐ ఎర్రం నాయుడు మాట్లాడు తూ డాక్టర్ కందుల నాగరాజు ప్రజల మనిషి అని కొని యాడారు తన సొంత నిధు లతో ఆయన ఎన్నో సేవా



కార్యక్రమాలను చేపట్టారని ప్రశంసించారు అతను చేస్తున్న మంచి పనులకు ప్రజల నుంచి కూడా మంచి స్పందన వస్తుందని వెల్ల డించారు ఈ కార్యక్రమంలో కృష్ణ,శ్రీను,ఆది,పాడి రమేష్, మల్ల శీను,మణికుమారి, సిపిఐ బుజ్జి,కుమారి,జానకి, కాంద్రేగుల అప్పారావు, కేదార్నాథ్ బద్రీనాథ్ తది తరులు పాల్గొన్నారు.

## కాఫీ తోటలను సందర్శించిన సియ్యారి దొన్నుదొర, కిడారి శ్రావణ్ కుమార్, కలెక్టర్ దినేష్ కుమార్.



**అరకు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 06:**

అల్లూరిసీతరామరాజు జిల్లా, అరకు వేల్లి మండలం, చిన్నలబుడు పంచాయతీ, పక్కనకుడి గ్రామం లో బెర్రి బోరర్ పురుగు వల్ల దెబ్బ తిన్న కాఫీ తోటలను పరిశీలించిన సియ్యారి దొన్ను దొర, కిడారి శ్రావణ్ కుమార్, అల్లూరిసీతరామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్.బెర్రీ బోరర్ పురుగు వల్ల కాఫీ పంటలు తేవ్రంగా నష్టం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలుగు దేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇంచార్జి, ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర,కిడారి శ్రావణ్ కుమార్, కలెక్టర్ దినేష్ కుమార్ కలిసి ఈ తోటలను పరిశీలించారు. బెర్రీ బోరర్ పురుగుల వల్ల కాఫీ తోటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలని ఆయన అధికారులకు సూచించారు. అలాగే అక్కడ పాల్గొన్న అధికారులు, పెద్దలు రైతులకు బెర్రీ బోరర్ పురుగు ఎక్కువ తోటలకు వ్యాపించికుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు అందించారు.

## దేవాలయాల్లో భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యత ఇస్తాం... తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి.



**విశాఖ పట్నం, సెప్టెంబర్ 6.**

రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని దేవాలయాల్లో భక్తుల సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు పేర్కొన్నారు. శనివారం నగరంలోని పెదవాల్తేరు లాసన్స్ బే కాలని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడె వెంకట పట్టాభిరామ్ తో కలసి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కూటమి ప్రభుత్వం దేవాలయాల్లో భక్తుల సదుపాయాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తుందన్నారు. క్రొత్తగా నియమితులైన ధర్మకర్తల మండలి ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడె వెంకట పట్టాభిరామ్ మాట్లాడుతూ క్రొత్తగా ధర్మ కర్తల మండలిలో నియమించ బడిన వారంతా మంచి సేవాభావంతో ఉన్న వారేనని, వారు ఇంకా మరింత సమర్ధ వంతంగా పనిచేసి దేవస్థానాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేసిన బైరెడ్డి గోవిందరెడ్డి మాట్లాడుతూ దైవ సేవ చేయడానికి తనకు పార్టీ కల్పించిన మంచి అవకాశాన్ని చక్కగా వినియోగించుకుని మంచి పేరు తెచ్చుకుంటానని పేర్కొన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులుగా అలజంగి ఈశ్వరరావు, నానాజీ, చిల్లకాట మణి, జగన్నాధ పద్మావతి, దశరథ రామయ్య, గొర్లె సుందరి దేముడు బాబు, జలగడుగుల రాధిక ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బైరెడ్డి పోతన రెడ్డి, బొట్ట రమణ, కాళ్ళ శంకర్, పీతల అమరేంద్ర, చిన్నపిల్లి ఆనంద రెడ్డి, చిన్నపిల్లి నరేంద్ర రెడ్డి, తారక్, గోపి, గొలగాని పోలారావు, తెడ్డు రాజు, కంభాపు శివారెడ్డి, దేవస్థానం ఈఓ ఆదినారాయణ, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## 11 వ వార్డ్ టీడీపీ అధ్యక్షుడు గా ముగడ రాజారావు ఏకగ్రీవఎన్నిక

**ఆరిలోవ, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్**

విశాఖ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాల మేరకు 11వ వార్డ్ కార్యాలయంలో వార్డ్ ఇంచార్జ్ రాగతి అచ్యుత్ రావు, త్రిసభ్య కమిటీ సభ్యులు రేఖా జ్యోతి ఆంధ్రప్రదేశ్ తెలుగు నాటక అకాడమీ డైరెక్టర్, మరియు ముదిండి కృష్ణంరాజు, మూది అప్పారావు , ఆధ్వర్యంలో వార్డు అధ్యక్షులుగా ముగడ రాజారావు , వార్డు ప్రధాన కార్యదర్శిగా ఆబోతుల అప్పలనాయుడు ని మరియు వార్డ్ పాలక వర్గమును, 11వ వార్డు క్రియాశీల సభ్యులు కార్యకర్తలు అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది, ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కార్యకర్తలు మహిళా నాయకురాలు పాల్గొన్నారు.



# మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి

- వైద్య విద్యతో రాజకీయం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- ప్రభుత్వ ధనంతో పూర్తి చేయాల్సిన వాటిని ప్రైవేటకు అప్పగించడం సబబు కాదు
- వైద్య విద్య, ప్రజారోగ్యాన్ని ప్రైవేటు పరం చేయడంలో కూటమి కుట్ర
- వైద్య విద్య కోసం జగన్ చేసిందేమీ లేదు
- నిధులు ఇవ్వకుండా సొంత డబ్బా కొట్టుకున్నారు
- బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ ఆగ్రహం




**పుంగనూరు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 06:**

రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని కూటమి తీసుకున్న నిర్ణయంపై బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ భగ్గుమన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 2019-2024 మధ్య అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, కానీ నిధులు ఇవ్వకుండా జాప్యం చేసిందన్నారు. రాష్ట్రంలో తామే వైద్య విద్యను ప్రోత్సహిస్తున్నామని వైసిపి సొంత డబ్బా కొట్టుకుందే తప్ప నిధులను మంజూరు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ కు చిత్తశుద్ధి ఉండి ఉంటే అధికారంలో ఉన్నప్పుడే నిధులను మంజూరు చేసి మెడికల్ కాలేజీల నిర్మాణాలను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. జగన్ అధికారంలోకి రాకముందు 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉండగా ఆయన అధికారంలోకి వచ్చాక 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి పూనుకున్నారని, వాటి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే అవి పూర్తి కాలేదన్నారు. చివరకు జగన్ హయాంలో ఆరోగ్య శ్రీ బిల్లులు కూడా పెండింగ్ లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటు పరం చేయడంతో పాటు ప్రజారోగ్యాన్ని కార్పోరేట్ శక్తులకు అప్పగించేందుకు ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. జగన్ హయాంలో నిర్మించతలపెట్టిన 17 మెడికల్ కాలేజీల్లో 10 మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. వైద్య విద్యను ప్రైవేటు పరం చేస్తే ఫీజులు గణనీయంగా పెరుగుతుయాన్నారు. ప్రైవేటు సంస్థలు లాభాపేక్షతో పనిచేస్తాయన్నారు. దీని వల్ల నిరుపేద విద్యార్థులకు అవకాశాలు తగ్గుతాయని హెచ్చరించారు. ఇప్పటికే రాష్ట్రం నుంచి చాలా మండి నిరుపేద విద్యార్థులు నీట్ లో సీట్లు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకప్పుడు 2,360 సీట్లు ఉంటే ఈ కొత్త కాలేజీల వల్ల ఆ సంఖ్య 4910 కి పెరుగుతుందని దానివల్ల మరో 2500 విద్యార్థులకు మేలు జరుగుతుందున్నారు. అయితే మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు ఇవ్వడం వల్ల చాలా మంది విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. రెండు ప్రభుత్వాలు కూడా వైద్యవిద్య, ప్రజారోగ్యంతో రాజకీయాలు చేశాయని ఆయన విమర్శించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటు పరం నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోకపోతే ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతామని ఆయన హెచ్చరించారు.

## లూలు మార్ట్ కి భూమి కేటాయింపును రద్దు చేయాలి

### ఆ భూముల్లో సైన్స్ సిటీ ని నిర్మించాలి




**జగదాంబ, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 06:**

విశాఖ సాగర తీరంలో లులుకు 13.74 ఎకరాల అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూమిని కేటాయించడాన్ని విశాఖపట్నం ప్రజా వనరుల పరిరక్షణ సమితి తీవ్రంగా తప్పు బట్టింది. ఆకేటాయింపులను వెంటనే రద్దు చేసి ఆ స్థలంలో సైన్స్ సిటీ ని నిర్మించాలని డిమాండు చేసింది. ఈ మేరకు శనివారం సాయంత్రం నగరంలోని ఆర్ కే బీచ్ లో కరపత్రాల పంపిణి కార్యక్రమాన్ని నిర్వహించింది. ముందుగా వేదిక చైర్మన్ రాణి శర్మ కరపత్రాలను విడుదల చేశారు. వేదిక కన్వీనర్ లు డాక్టర్ సీ ఎన్ క్షేత్రపాల్ రెడ్డి, వెంకట లక్ష్మి, ఎన్ ప్రతాప్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఏదైనా సరే ప్రజల ప్రయోజనాలకే వినియోగించుకోవాలని హితవు పలికారు. తక్షణమే లులు కి భూమిని కేటాయిస్తూ ఇచ్చిన జీవో ను రద్దు చేయాలనీ డిమాండు చేశారు. కూటమి సర్కారు అధికారం చేపట్టిన తరువాత నగరంలోని ప్రభుత్వ భూములు అన్నీ కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు మన్మధరావు, యం పైడిరాజు, పౌర ప్రజా సంఘాల సమన్వయ కర్త పి చంద్రశేఖర్, సీఐటీయూ నాయకురాలు పి మణి, ఎ పి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె వనజాక్షి, ఎం డి బేగం, ఎ ఐ ఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి యు నాగరాజు, ఎ ఐ వై ఎఫ్ జిల్లా కార్యదర్శి వై రాంబాబు, డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి యు ఎస్ ఎన్ రాజు, బానాసా నాయకుడు నూకరాజు, కార్మిక నాయకుడు రవి ఎ దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతన్నకు యూరియా కోసం కష్టాలు!

**సిటిజన్ టైమ్స్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా:సెప్టెంబర్ 06**

ఓటు వేసిన పాపానికి పాలకులను ఏమీ అనలేక క్యూ లైన్ లో రాత్రి వరకు నిలుచొని సహనం కోల్పోవడంతో రైతులే ఒకరినొకరు చెప్పులతో తానే కొట్టుకునే దుస్థితి వచ్చింది, దీని అంతటికి కారకులు ఎవరు? దేశంలో 28 రాష్ట్రాలు ఉన్నాయి కానీ తెలంగాణ రైతులే యూరియా కోసం ఎందుకు కష్టాలు పడుతున్నారు మన పక్క రాష్ట్రమైన ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, అంతెందుకు అత్యధికంగా వరి పండించే పంజాబ్ రాష్ట్రంలోనూ అన్నదాతలకు ఈ తిప్పలు లేవు మరి ఎందుకు ఒక తెలంగాణ రాష్ట్రంలోనే ఈ పరిస్థితి దాపురించింది ఆడ మగ తేడా లేకుండా తెల్లవారుజాము నుండి రాత్రి దాకా ఎరువుల కోసం ఎందుకు రైతులు పడి కాపులు కాస్తున్నారు. దీనికి కారకులు ఎవరు?.. యూరియా కొరత లేదని ఇటు కేంద్ర ప్రభుత్వం అటు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్న గ్రామాల్లో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గ్రామాల్లోని రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొసైటీలకు, ఫెర్టిలైజర్ దుకాణాల కు యూరియా వస్తుందని తెలువడంతో మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా పిల్లలతో కలిసి వచ్చి తెల్లవారుజాము నుండే బారులు తీరారు. కొద్ది మంది రైతులకే యూరియా లభించడంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు. వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతోనే యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నామని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా కొరత వల్ల పనులన్నీ మానుకుని కేంద్రాల వద్ద నిరీక్షించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఏకంగా మంత్రి శ్రీధర్ బాబు, ఇలాకలో ఇలాంటి పరిస్థితి ఉండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా



ఎలాంటి కోరత లేకుండా యూరియా వచ్చే లా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## సమస్యకు శాశ్వత పరిష్కారం



**మధురవాడ , సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 06:**

జీవీఎంసీ 13వ వార్డు పరిధిలోని స్కిల్ డెవలప్మెంట్ మూడసర్లోవ వాకర్ అసోసియేషన్ ఓపెన్ జిమ్ దగ్గర వీధి దీపాలు స్తంభాలు లేని కారణంగా వాకర్స్ మరియు పార్కు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలు అభ్యర్థనలు రాగా వార్డ్ కార్పొరేటర్ సునీత సత్యనారాయణ స్పందించి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి తీసుకువెళ్లగా మున్సిపల్ అధికారులతో మరియు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి దగ్గరుండి కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ పరివేక్షించి సుమారుగా 1,20,000 రూపాయల నిధులతో మూడు నూతన విద్యుస్తంభాలు వేయించి వాటికి విద్యుత్ దీపాలు కూడా వేయించడం జరిగింది. కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు ఎవరైనా సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే అధికారులు మరియు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని, ఇప్పటికే తాము ప్రజలకు పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, కూటమి ప్రభుత్వం ప్రజల అభివృద్ధికి పాటుపడుతుందని ప్రజలు తమ కార్యాలయానికి వచ్చి సమస్య చెబితే తప్పకుండా స్పందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలోస్ట్రీట్ లైట్ వర్క్ ఇన్స్పెక్టర్ రామ్ శంకర్ ,వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, ప్రసాద్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు ఒడిసెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పశుపోషణ ఆవశ్యకతపై రైతులకు శిక్షణా కార్యక్రమం.

**పీలేరు ఇంచార్జి సెప్టెంబర్ 6. సిటిజన్ టైమ్స్.**

పీలేరు మండలం తలపుల గ్రామంలో పశుపోషణ ఆవశ్యకత పై ఆత్మసంస్థ చిన్న గొట్టిగల్లు బ్లాక్ వారి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు. రైతుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తి ని పెంచుకోవాలి అంటే పశుపోషణలో ముఖ్యమైన సైలేజ్ తయారీ విధానాన్ని, సైలేజ్ విధానంలో తయారు చేసిన మేతను వాడుకోవడం ద్వారా ఆవుల పాల దిగుబడిని 2-3 లీటర్లు అదనంగా పెంచుకోవచ్చు అని తెలిపారు. పొదుగు వాపు వ్యాధి రాకుండా పాలు పిండిన తరువాత ఆవుల విషయంలో రైతులు తీసుకోవలస జాగ్రత్తల గురించి, గాలికుంటు, బొబ్బల వ్యాధి రాకుండా ముందుగానే పశువులకు టీకాలు వేసుకోవడం ద్వారా అధిక నష్టాన్ని అరికట్టవచ్చు అని తెలిపారు. పుట్టిన దూడలకు 10 రోజుల తరువాత నుండీ 6 నెలలు వ్యవధిలో పలు దఫాలుగా పెరుగు మందును ఇవ్వడం వలన దూడలు ఆరోగ్యాకరమైన ఆవులుగా ఎదుగుతాయని తెలిపారు. ఆత్మ ద్వారా 1%దివీ% మినరల్ మిక్చర్ ప్యాకెట్ లను రైతులకు అదించడం జరిగింది. బాహ్య పరాన్న జీవులను అరికట్టే చర్యలో భాగంగా ఆవులకు పిడుదుల మందును స్ప్రే చేయించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ బి యం జ్యోత్స్న, రైతులు,వెటర్నరీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జనం సందర్భంగా బందోబస్తు నిర్వహించడానికి వచ్చిన పోలీస్ అధికారులు




**సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06 గజ్వేల్**

పోలీస్ స్టేషన్ ఆవరణలో పటిష్టమైన బందోబస్తు గురించి తగు సూచనలు సలహాలు చేసి దిశా నిర్దేశం చేసిన పోలీసులు ఈ సందర్భంగా గజ్వేల్ ఏసీపి నరసింహులు మాట్లాడుతూ బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులు సిబ్బంది వినాయక శోభయాత్ర మరియు నిమజ్జనం అయ్యేంతవరకు కేటాయించిన ప్రదేశాలను వదిలి వెళ్ళవద్దని సూచించారు. ప్రశాంతమైన శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. వినాయక మండపాల ఆర్గనైజర్లు కార్యవర్గ సభ్యులు పోలీసుల సలహాలు సూచనలు పాటించి వినాయక శోభాయాత్ర మరియు నిమజ్జనం కార్యక్రమాన్ని శాంతియుతంగా ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని తెలిపారు.

శోభయాత్ర మరియు నిమజ్జన చేయు చెరువుల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఇన్స్పెక్టర్లు రవికుమార్, ముత్యం రాజు,ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వంటేరు ప్రతాపరెడ్డిని పరామర్శించిన హరీశ్ రావు



**సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06 జగదేవపూర్**

గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి వంటేరు ప్రతాపరెడ్డిని మాజీ మంత్రి హరీష్ రావు పరామర్శించారు. రెండు రోజుల క్రితం ప్రతాపరెడ్డి మాతృమూర్తి వజ్రమ్మ అనారోగ్యంతో మృతి చెందగా శనివారం జగదేవపూర్ మండలం లోని దౌలాపూర్ గ్రామంలో ఆయన స్వగృహానికి హరీశ్ రావు వెళ్లారు. వజ్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఆయన వెంట ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నాయకులు, తదితరులున్నారు.

## తెలంగాణలో ప్రశాంతంగా గణనాథుల నిమజ్జనం: డీజీపీ జితేందర్!



**సిటిజన్ టైమ్స్ హైదరాబాద్:సెప్టెంబర్ 06**

మహా నగరంలో వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగుతు న్నాయని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రక్రియ కొనసాగుతున్నట్లు డిజిపి జితేందర్ మీడియా సమావేశంలో తెలిపారు. శనివారం నాడు అయన మీడియాతో మాట్లాడు తూ...రాష్ట్రంలో అన్ని చోట్ల నిమజ్జన కార్యక్రమం కొనసాగుతోందన్నారు. గణనాథుల నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్‌లో మూడు కమిషనరేట్ల పరిధిలో ప్రత్యేక బలగాలు మోహరించాయని తెలిపారు. హైదరాబాదులోని మూడు కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక బలగాలు విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు రాష్ట్రంలో ఎంతో కీలకమైన ఖైరతాబాద్ గణేషుడి నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందని డీజీపీ జితేందర్ చెప్పారు. బాలాపూర్ గణపతి శోభా యాత్ర ప్రారంభమైందని.. నాలుగు గంటల్లోపు బాలాపూర్ వినాయకుడి నిమజ్జనం పూర్తవుతుందని డీజీపీ వివరించారు. వినాయక నిమజ్జనం ఆదివారం వరకు కొనసాగుతుందని డీజీపీ తెలిపారు. ప్రజలు కూడా త్వరగా నిమజ్జనం పూర్తి చేసేందుకు సహకరించాలని డీజీపీ జితేందర్ విజ్ఞప్తి చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అదనంగా ప్రత్యేక ఫోర్స్ విధుల్లో ఉందన్నారు..డీజీపీ కార్యాలయం, బంజారాహిల్స్ లోని ఐసీసీసీ లో కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నా మన్నారు.

# అందుబాటులోకి నిత్యవసర సరుకులు!

**సిటిజన్ టైమ్స్ మంథని:సెప్టెంబర్ 06**



జీఎస్టీ స్లాబుల తగ్గింపుతో నిత్యావసరాలు అందు బాటులోకి రావడంతో పాటు అన్ని రంగాలకు మేలు జరుగుతుందని, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండపాక సత్య ప్రకాష్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ,నేతృత్వంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, సంయుక్త నిర్ణయం మేరకు పేద ప్రజల నిత్యవసర వస్తువులపై ఆటోమొబైల్ రంగంలోని వస్తువులపై గణనీయమైన రీతిలో జీఎస్టీ ని తగ్గించారన్నారు. దీన్ని పురస్కరించుకొని, బిజెపి రాష్ట్ర నాయకులు చందుపట్ల సునీల్ రెడ్డి, ఆదేశాల మేరకు...పెద్దపల్లి జిల్లా మంథని మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం నరేంద్ర మోడీ చిత్రపటానికి బిజెపి నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ....కేంద్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జీఎస్టీ స్లాబులను తగ్గించిందని, జీఎస్టీ స్లాబుల తగ్గింపుపై అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. నిత్యావసర సరుకులు తగ్గే విధంగా రైతులకు, విద్యార్థులకు, సామాన్య ప్రజలకు మేలు జరిగేలా నిత్యవసర సరుకులపై 12% శాతం ఉన్న జీఎస్టీని 5%, శాతం జీఎస్టీ స్లాబులను తగ్గించిందని బిజెపి నాయకులు స్పష్టం చేశారు. జీఎస్టీ స్లాబులను అతితక్కువకు తగ్గించడం తో సామాన్యులకు లాభం చేకూరనుందన్నారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండపాక సత్య ప్రకాష్, రాష్ట్ర ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి పూసాల రాజేంద్రప్రసాద్, జిల్లా కౌన్సిల్ నెంబర్ శ్రీనివాస్, అసెంబ్లీ కో కన్వీనర్ నాంపల్లి రమేష్, నారమల్ల కృష్ణ,బూడిద తిరుపతి, పట్టణ ప్రధాన కార్యదర్శులు శ్యామల అశోక్,ఎడ్లసాగర్, వేల్పుల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిస్తాం -ఎం.మోహన్ రావు



**కావలి, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06**

కామ్రేడ్ సీతారామ్ ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా కావలి పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో శనివారం పట్టణ కార్యదర్శి పి పెంచలయ్య అధ్యక్షతన సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం మోహన్ రావు, ఎస్.కె రెహనా బేగం మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే ఉద్యమాలకు నాయకత్వం వహించి సిపిఐఎం అఖిలభారత కార్యదర్శిగా పార్లమెంటు సభ్యుడిగా ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా దేశంలోని అన్ని ప్రతిపక్ష పార్టీలను ఏకతాటిపైకి తేవడంలో ముందుండి కృషి చేశారు అన్నారు. యూపీఏ ప్రభుత్వ కాలంలో ఉపాధి హామీ చట్టం సమాచార హక్కు చట్టం లాంటి అనేక చట్టాలు రూపొందించడంలో కీలకమైన పాత్ర పోషించారు అని దేశ సమైక్యత సమగ్రత కోసం పాటుపడ్డారు అన్నారు. సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం తుది శ్వాస విడిచేంతవరకు పనిచేశారని ఆయన ఆశయాలను ఆదర్శాలను ముందుకు తీసుకుపోయేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు కృష్ణమోహన్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య విద్యార్థులకు అమర్‌నాథ్ చేత మోటివేషన్ క్లాస్





**కావలి, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06**

కావలి పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం ప్రముఖ విద్యావేత్త, మోటివేటర్ 50కి పైగా బాలమిత్ర క్లాసులు రెండు తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నిర్వహించిన వాసిరెడ్డి అమర్‌నాథ్ చేత శనివారం శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ విద్యార్థిని విద్యార్థులకు బాలమిత్ర క్లాసు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లైఫ్ గ్లామర్ ను నమ్ముకుంటే జీవితం అంతా గ్లామర్ గా ఉంటుందని, కానీ గ్లామర్ మాత్రమే నమ్ముకుంటే నాడీ సముద్రంలో మునిగినట్లేనని సూచించారు. జీవితంలో సాధించాల్సిన లక్ష్యాలు, వాటిని చేరుకునే మార్గాలు, అలాగే సరైన %ఆ%6 సూత్రాల గురించి సుదీర్ఘంగా వివరించారు. ఆయన స్ఫూర్తిదాయకమైన మాటలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు మార్గం చూపించాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది. బాలమిత్ర క్లాస్ వినడం కోసం వారి శిష్యులు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ జి.మాధురి, ఇరిగేషన్ కన్సల్టెంట్ ఎ.ఎల్.మాల్ రెడ్డి హాజరయ్యారు. వాసిరెడ్డి అమర్‌నాథ్ ప్రసంగం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేద వర్గాలకు వరం

**భట్టిప్రోలు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06**



ముఖ్యమంత్రి సహాయ నిధి ఫండ్ పేద వర్గాలకు ఎంతో మేలు చేకూరుస్తుందని ఎమ్మెల్యే ఆనందబాబు అన్నారు. భట్టిప్రోలు మండల పరిధిలో 12 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి భట్టిప్రోలు మండలం భట్టిప్రోలు గ్రామానికి చెందిన నలుగురు,అద్దేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు,ఐలవరం గ్రామానికి చెందిన ఇద్దరు, పల్లెకోన గ్రామానికి చెందిన ఇద్దరు, కోనేటిపురం, గుత్తావారిపాలెం గ్రామాలకు చెందిన నలుగురు అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స లు చేఇంచుకున్నారు. చికిత్సల కోసం అయిన;బిల్లులను వేమూరు నియోజక వర్గ శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు వారి రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ కార్యాలయానికి; పంపించారు. తదుపరి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కు రూపంలో భట్టిప్రోలు గ్రామంకు చెందిన సయ్యద్ అబ్దుల్ కలాం కు రూ 46,681 లు, షేక్ ఫాతి మున్నిసా కు రూ 20,000 లు, పెరుమాళ్ళ శ్రీదేవి కి రూ 16,326 లు చల్లపల్లి దుర్గా మణికంఠ కు రూ 15,000 లు అద్దేపల్లి గ్రామ నివాసి కథం సంజీవరావు కు రూ 35,000 లు, యడ్ల నాంచారమ్మ కు రూ 20,500 లు, ఐలవరం గ్రామానికి చెందిన శొంఠి భాను చందర్ కు రూ 1,20,744 లు, పంచుమర్తి విమలా దేవి కి రూ 95,278 లు, పల్లెకోన గ్రామ నివాసి కంభం సల్మాన్ కు రూ 42,100 లు, ఒడుగు కోటేశ్వరరావు కు రూ 16,418 లు, కోనేటిపురం గ్రామానికి చందినజంపని సునీత 42,000 లు, గుత్తావారిపాలెం గ్రామానికి చెందిన తెనాలి జయరావు కు రూ 20,000 లు,మొత్తం రూ 4,90,047 లు మంజూరు చేసి ఉన్నారు. మంజూరు అయిన మొత్తాన్ని వారికి,వారి కుటుంబ సభ్యులకు;చెక్కుల రూపం లో మాజీ మంత్రి,వేమూరు శాసనసభ్యులు ఆనంద బాబు శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా,రాయన ప్రసాద రావు,గోపాల్, గుర్రం నాగబాబు,జి లెనిన్ తదితరు నాయకులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్



**గోపాలపట్నం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 06:**

శంఖబ్రత బాగ్చి, ఐ.పీ.ఎస్, కమీషనర్ ఆఫ్ పోలీస్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నగరంలోని పలు చోట్ల ట్రాఫిక్ పోలీసు అధికారులు మరియు సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించి, హెల్మెట్ ధరించిన వారినీ అభినందిస్తూ, హెల్మెట్ ధరించని వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, వారిపై కేసులు నమోదుచేయడమైనది.

## గంగమ్మ ఒడికి చేరిన గణనాథుడు



**సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్06 జగదేవపూర్**

జగదేవపూర్ మండలం లోని మహా గణనాథుడి నిమజ్జనం

కార్యక్రమం ఘనంగా పూర్తయింది. నవరాత్రులలో భక్తుల ప్రత్యేక పూజలందుకున్న గౌరీ తనయుడు గంగమ్మ ఒడికి చేరాడు. గణేష్ శోభాయాత్రలో డీజే డప్పుల బ్యాండుమేళాలు, డప్పుచప్పుళ్ళు నడుమ ఘనంగా గణేష్ శోభ యాత్ర నిర్వహించారు, నిమజ్జనానికి తరలి వెళ్లే వినాయక వాహనాల శోభాయాత్రను చూడటానికి భక్తులు భారీగా తరలి వచ్చి స్వామి వారి ఆశీస్సులు తీసుకుని బై బై గణేష్ జై జై వినోదాల మధ్య ఊరేగింపులో మండలం లోని ఉన్న చెరువు లో నిమర్జనం చేశారు.

## శ్రీనివాస్ గౌడ్ ను పరామర్శించిన హరీశ్ రావు





**సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్06 జగదేవపూర్**

జగదేవపూర్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ కొన్ని రోజుల క్రితం కాలు ప్యాచర్ కావడంతో శనివారం మాజీ మంత్రి హరీష్ రావు జగదేవపూర్ లోని వారి నివాసంలో కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి,ఎమ్మెల్యే చింత ప్రభాకర్,డీ సి సి బి డైరెక్టర్ అంజి రెడ్డి , మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, మాజీ ఎంపిటిసి కిరణ్ గౌడ్, స్థానిక అధ్యక్షులు బుద్ధ నాగరాజు,మాజీ వార్డు సభ్యులు మహేష్,మాజీ కో ఆప్షన్ ఇక్బాల్,మాజీ వార్డు సభ్యులు పాతిమ ఆలిం, నాయకులు వెంకట్ రెడ్డి,బాల్ రెడ్డి,సర్పంచ్ మాజీ యాదవ రెడ్డి,భాస్కర్,శ్రీను,మహేందర్,ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వారి సేవ లో హాస్య నటుడు గిరి.

**ద్వారకాతిరుమల, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 06**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి సినీ హాస్యనటుడు గిరి శనివారం విచ్చేశారు. శ్రీ స్వామివారి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖా మండపంలో వేద పండితులు వేదఆశీర్వచనాలు ,శ్రీస్వామివారి ప్రసాదాలను, శేష వస్త్రాన్ని సమర్పించారు.



# దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషిచేస్తోంది : ప్రత్తిపాటి

### గత ప్రభుత్వం దేవాలయాలను, దేవుళ్లను కూడా తమస్వార్థ రాజకీయాలకు వాడుకొంది : ప్రత్తిపాట

### సీతారామస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారోత్సవంలో మాజీమంత్రి ప్రత్తిపాటి







**చిలకలూరిపేట, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06**

చిలకలూరిపేట : గత ప్రభుత్వం దేవాలయాలను, దేవుళ్లను కూడా తమ స్వార్థ రాజకీయాలకు వాడుకుందని, రథాలు తగలుబెట్టి, విగ్రహాలు ధ్వంసం చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, పవిత్రమైన తిరుమల క్షేత్రంపై కూడా విషప్రచారానికి పాల్పడిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. దేవుళ్లను అవమానించి, పవిత్రమైన సున్నితమైన అంశాలతో రాజకీయాలు చేసినందుకే గత ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు గట్టిగా బుద్ధిచెప్పారని ప్రత్తిపాటి చెప్పారు. పట్టణంలోని మెయిన్ బజార్ లో గల సీతారామస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రత్తిపాటి.. మండలిలోని సభ్యుల్ని పేరుపేరునా అభినందించిన అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడారు.

**పట్టణానికి గుండెకాయ సీతారామస్వామి దేవస్థానం..**

పట్టణంలోని సీతారామస్వామి దేవస్థానం అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించానని, తాను తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు, ఆనాడు మఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి, రూ.45 లక్షల నిధులు సమకూర్చడం జరిగిందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. సీతారామస్వామి దేవస్థానం చిలకలూరిపేట పట్టణానికి గుండెకాయ వంటిదని, దేవాలయానికి ఉన్న విశిష్టత, ప్రాధాన్యతను అందరూ గుర్తించాలన్నారు. దేవాలయ అభివృద్ధికి అవసరమైన నిధులు అందించడానికి కూటమిప్రభుత్వం కూడా సిద్ధంగానే ఉందని ప్రత్తిపాటి చెప్పారు. ప్రధాన దేవాలయాల్లో ఇప్పటికే నిత్యాన్నదాన సేవను ప్రభుత్వం ప్రారంభించిందని, నియోజకవర్గంలోని ప్రధాన దేవాలయాలన్నింటినీ సీ.జీ.ఎఫ్ నిధులతో అభివృద్ధి చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పురుషోత్తమ పట్నంలోని వేణుగోపాలస్వామి దేవాలయ అభివృద్ధికి రూ.1.30కోట్లు, తుర్లపాడులోని దేవాలయానికి రూ.కోటివరకు నిధులు తీసుకొచ్చానని ప్రత్తిపాటి తెలిపారు. ప్రభుత్వ అధీనంలో లేని దేవాలయాల అభివృద్ధికి కూడా నిధులు అందించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. భక్తుల మనోభావాలు గౌరవించి, వారి ఆలోచనలకు అనుగుణంగా ఆలయాలను అభివృద్ధి చేస్తున్నకూటమిప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని ప్రత్తిపాటి కోరారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తిరుమల క్షేత్రాన్ని కూటమిప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. కమిటీ సభ్యులు చైర్మన్ గా గ్రంథి భాస్కర్, సభ్యులు యల్లంపల్లి శ్రీరాములు, అర్వపల్లి వీరాంజనేయులు, జరపాల మోతి భాయి, శనగవరపు గోపీనాథ్ శాస్త్రి, గుళ్ళ నాగలక్ష్మి, కోడూరి శ్రీనివాసరావు, దీవి మాధవ రామాచార్యులు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, టీడీపీ పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, కార్యదర్శి మద్దుమలా రవి, బీజేపీ నాయకులు గట్టా హేమ, మల్లెల శివనాగేశ్వరరావు, కొత్త కుమారి, కనమర్లపూడి లక్ష్మీ తిరుమల, కూనల ప్రమీల, అమరా రమాదేవి, గుర్రం సాంబశివరావు, శ్రీనివాసా గుప్తా, చేవూరి కృష్ణమూర్తి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ప్రత్తిపాటి



**చిలకలూరిపేట రూరల్, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06**

ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం.ఆర్.ఎఫ్ చెక్కుల్ని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు శనివారం తన నివాసంలో లబ్ధిదారులకు అందచేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, వైద్యసేవల కోసం తగినంత ఆర్థిక సహాయం అందించాలని పలువురు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియచేశారు. వారి వినతులు పరిశీలించిన ప్రభుత్వం తాజాగా వారికి ఆర్థిక సహాయం అందిస్తూ చెక్కులు మంజూరుచేసింది. 45 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.24.76లక్షల విలువైన చెక్కుల్ని ప్రత్తిపాటి స్వయంగా అనారోగ్య బాధితులకు, వారి కుటుంబసభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, రూరల్ మండలం అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమలా రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు తుపాకుల అప్పారావు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ హోదాలలో నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## సూర్యలంక బీచ్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించడానికి చర్యలు చేపట్టాలి..

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



**బ్యూరో బాపట్ల, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06**

ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా సూర్యలంక బీచ్ లో బీచ్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. శనివారం, స్థానిక కలెక్టరేట్ లోని వీక్షణ సమావేశ మందిరంలో రియల్ ఎస్టేట్, బంగారు నగల వ్యాపారులు, బీచ్ రిసార్ట్ యాజమాన్యం, రైస్ మిల్లర్స్, పెట్రోల్ బంక్, ఎరువులు, విత్తనాల వ్యాపార సంఘ సభ్యులతో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సంయుక్త కలెక్టర్ జి. గంగాధర్ గౌడ్,జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డీఎస్ఓ అమిర్ భాష, బాపట్ల చీరాల రెవెన్యూ అధికారులకు గ్లోరియా చంద్రశేఖర్, బాపట్ల చీరాల మున్సిపల్ కమిషనర్లు రఘునాథరెడ్డి అబ్దుల్ రషీద్, బాపట్ల చీరాల మండల రెవెన్యూ అధికారులు సలీమా, గోపికృష్ణతదితరులు పాల్గొన్నారు.

## బాలుడిని తల్లిదండ్రులకు అప్పజెప్పిన ఎస్సై జనార్ధన్




**వేటపాలెం, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06**

వేటపాలెంలోని రైల్వే స్టేషన్ ఏరియాలో శనివారం అర్థం కాని పరిస్థితిలో తిరుగుతున్న బాలుడిని పోలీసులు గుర్తించారు. ఎస్సై జనార్ధన్ బాలుడి ఫోటోను గ్రూపుల్లో పెట్టి ఆచూకీ తెలుసుకున్నారు. అనంతరం, బాలుడి తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, శ్రీనులకు వారి కుమారుడిని అప్పగించారు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు ఎస్సై జనార్ధన్ కు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులు సకాలంలో స్పందించి బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించడం జరిగింది.

## అంగన్వాడీ సెంటర్‌కి టేబుల్స్ వితరణ

**బాపట్ల, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06**

పల్నాడు జిల్లా ఈపూరు మండలంలోని ఉప్పరపాలెం గ్రామం నందు యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పమిడిపల్లి ఇశ్రాయేలు మనుమరాలు పుట్టినరోజు సందర్బంగా వారి సహకారం తో కొచ్చర్ల ఉప్పరపాలెం గ్రామంలోని అంగన్వాడీ సెంటర్ నందు విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్స్, చాకొలేట్లు,లంచ్ బాక్సులు పంపిణి చేసారు మరియు సెంటర్ కు అవసరం అయిన స్టడీ టేబుల్ అందచేశారని ఫౌండేషన్ వ్యవస్థపాక అధ్యక్షులు అనిల్ రాజ్ తెలియచేసారు. మరియు సహకరించిన దాతలకు ధన్యవాదములు తెలియచేసారు. ఈ కార్యక్రమానికి గ్రామ మాజీ సర్పంచ్ కూరాకుల శ్రీదేవి, ఫౌండేషన్ సెక్రటరీ రాహుల్ నాయక్,జనరల్ సెక్రటరీ మనోహర్ బాబు, సభ్యులు పెనుమల వెంకట్రావు, కడియం సునీల్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## కొల్లిశారద హోల్ సేల్ మార్కెట్ లో దుకాణాలకు చట్ట ప్రకారమే బహిరంగ వేలం నిర్వహించాము.. కమిషనర్ పులి శ్రీనివాసులు..



**గుంటూరు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06**

ప్రభుత్వం నుండి అనుమతులు లేకుండా హోల్ సేల్ వ్యాపారాలకు నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహించడానికి వీలు లేదని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం అనుమతులు లేకుండా హోల్ సేల్ వ్యాపారాలు చేస్తున్న వారితో, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రైవేట్ గా హోల్ సేల్ మార్కెట్ నిర్వహించాలి అంటే వివిధ ప్రభుత్వ శాఖల నుండి షుమారు 16 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే కొల్లిశారద నగరపాలక సంస్థ హోల్ సేల్ మార్కెట్ లో దుకాణాలకు చట్ట ప్రకారమే బహిరంగ వేలం నిర్వహించామని, ఇప్పటికే షాప్ ల వేలంలో దక్కించుకున్న వారిలో 41 మంది షాప్ లను ఆక్యుపై చేశారన్నారు. కాని కొందరు నగరపాలక సంస్థ హోల్ సేల్ మార్కెట్ కి రైతులు కూరగాయలు తీసుకురాకుండా వేరే ప్రాంతాల్లో మార్కెట్ ఉందని మోసపూరిత ప్రకటనలు ఇస్తున్నారన్నారు. అటువంటి వారి పై చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. ప్రైవేట్ గా హోల్ సేల్ మార్కెట్ ఏర్పాటు చేసుకోవాలి అనుకునేవారు సంబంధిత నిర్దేశిత విధానంలో అనుమతులకు దరఖాస్తు చేసుకొని, అనుమతులు వచ్చిన అనంతరమే వ్యాపారాలు చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం అనుమతులు లేకుండా జాతీయ రహదారి వెంబడి మార్కెట్ ఏర్పాటు చేయడానికి ప్రయతిస్తున్న వారు తగిన అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, అనుమతుల మంజూరు వేగవంతంకు జిఎంసి నుండి కూడా సహకరిస్తామని తెలిపారు. సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ఎండి.నజీనా బేగం, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఏ.గాయత్రి, సిపిడిసిఎల్ ఈఈ శ్రీనివాసరావు, భూగర్భ జల శాఖ డిడి డి.వందన, మార్కెటింగ్ ఏడి సత్యనారాయణ చౌదరి, పాత గుంటూరు ఎస్.హెచ్.ఓ కే.వెంకట ప్రసాద్, హార్టికల్చర్ డిడి రవి, జిఎంసి రెవెన్యూ అధికారి సాధిక్ పాషా, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠాలు చెప్పిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

### ఎంపీ ఎల్ మోడల్ హై స్కూల్ ఆకస్మిక తనిఖీ





**నరసరావుపేట, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06**

నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు శనివారం పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో శ్రీ అల్లూరి సీతారామరాజు ఎంపీఎల్ మోడల్ హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించి, విద్యా ప్రమాణాలు మరియు మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సరదాగా పాఠాలు కూడా బోధించారు.ఎమ్మెల్యే తన సందర్శనలో భాగంగా, పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందా, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా అనే అంశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్ రికార్డులను పరిశీలించి, ఉపాధ్యాయుల హాజరు మరియు విద్యా ప్రక్రియను సమీక్షించారు. అదే విధంగా విద్యార్థులకు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలపై కూడా ఆయన దృష్టి సారించారు. తరగతి గదిలోకి ప్రవేశించిన డాక్టర్ చదలవాడ అరవింద బాబు విద్యార్థులతో సరదాగా సంభాషిస్తూ, వారికి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే యొక్క ఈ చొరవ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడంతో పాటు, ఉపాధ్యాయులకు కూడా ప్రోత్సాహాన్ని అందించింది.ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు కూడా పాల్గొన్నారు. పాఠశాలలో విద్యా నాణ్యత మరియు సౌకర్యాలను మెరుగుపరచడానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## అవార్డు పొందిన గురువులకు సత్కారం




**భట్టిప్రోలు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06**

భట్టిప్రోలు తమ్మన మల్లికార్జునరావు ఉన్నత పాఠశాల నందు గురుపూజోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పులికొండ మల్లికార్జున రావు అధ్యక్షతన నిర్వాహింపబడిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఓలేటి రోజా రమణి,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి సురేష్ కుమార్ లు పాల్గొన్నారు.వక్తలు గురుపూజోత్సవం ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థుల ప్రసంగాలు నృత్య కార్యక్రమాలతో ఆద్యంతం కన్నుల పండుగ గా కార్యక్రమం నిర్వహింపబడింది. సభా కార్యక్రమం అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఓలేటి రోజా రమణి ని,మరియు పాఠశాల ఉపాధ్యాయులందరినీ కరస్పాండెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులు అందరి చేత సన్మాన కార్యక్రమం నిర్వహింపబడినది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందులూరి రామ కోటేశ్వరరావు, అత్తోట సుగుణ కుమారి,కోటేశ్వరమ్మ ఉమామహేశ్వరరావు, మురళీధరరావు, బెల్లంకొండ శ్రీనివాసరావు, సుబ్బారావు,అనూల్ హక్,చేబ్రోలు శ్రీనివాసరావు,లక్ష్మీపార్వతి,సత్య రత్న లను ఉపాధ్యాయులను కరస్పాండెంట్ మరియు విద్యార్థినీ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు అందరూ కృతజ్ఞతాపూర్వకంగా కరస్పాండెంట్ పులికొండ మల్లికార్జునరావును సన్మానించారు.

## మర్యాదపూర్వకంగా కలిసిన వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లెం అంజమ్మ

**చీరాల, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 06**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ గా వేటపాలెంకు చెందిన మల్లెం అంజమ్మను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా శనివారం చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్యను అంజమ్మ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర సామాజిక వర్గ సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అంజమ్మకు సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



# సూర్యతో కలిసి కీర్తి సురేష్



# మళ్లీ జోడీగా విజయ్, రష్మిక.. ఈసారి ఏం చేస్తారో..



టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న రిలేషన్ లో ఉన్నారని ఎప్పటి నుంచో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. త్వరలోనే గుడ్ న్యూస్ చెప్పనున్నారని అంతా వెయిట్ చేస్తున్నారు. అయితే రీసెంట్ గా న్యూయార్క్ లో జరిగిన ఇండియా డే పరేడ్ లో ఇద్దరూ కలిసి కనిపించడంతో ఊహాగానాలకు మరింత బలం చేకూరింది.అదే సమయంలో గీత గోవిందం, డియర్ కామ్రేడ్ వంటి సినిమాల తర్వాత మళ్లీ ఎప్పుడు జోడీగా నటిస్తారోనని అంతా ఎదురుచూస్తున్నారు. అయితే తాజాగా విజయ్, రష్మిక సైలెంట్ గా మూడో సినిమాను స్టార్ట్ చేసినట్లు తెలుస్తోంది. యంగ్ డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో యాక్ట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి హడావుడి లేకుండా ఇటీవల హైదరాబాద్ లో ఫస్ట్ షెడ్యూల్ మొదలైనట్లు సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఆ సినిమా కథ విన్న వెంటనే రష్మిక ఓకే చెప్పారని తెలుస్తోంది. హిట్ పెయిర్ రిపీట్ అవ్వడంతో అప్పుడే ఆడియన్స్ తో పాటు ఇద్దరి అభిమానుల్లో సినిమాపై అంచనాలు భారీ రేంజ్ లో క్రియేట్ అయ్యాయి.అదే సమయంలో 1854 - 1878 మధ్య బ్రిటిష్ పాలన నేపథ్యంలో జరిగిన ఘటన ఆధారంగా సినిమాను తెరకెక్కిస్తున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. విజయ్ దేవరకొండ రాయలసీమ యాసలో, ఇప్పటివరకు ఎప్పుడూ పోషించని ఒక విలక్షణమైన పల్లెటూరి పాత్రలో కనిపించబోతున్నారని సమాచారం. కెరీర్ లో అలాంటి పాత్ర చేయడం ఫస్ట్ టైమ్.సినిమాలో ఎమోషన్స్, యాక్షన్ సన్నివేశాలు చాలా స్ట్రాంగ్ గా ఉంటాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రాహుల్ సాంకృత్యాన్ అద్భుతమైన స్క్రీన్ ప్లేతో మూవీని ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారని సమాచారం. అయితే థ్రిల్, ఎమోషన్ ను మిళితం చేసే భారీ యాక్షన్ రొమాన్స్ మూవీని ఆయన తీస్తున్నారని ఇప్పుడు తెలుస్తోంది.కాగా..

ఒకప్పుడు గీత గోవిందం మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ ను అందుకున్నారు విజయ్, రష్మిక. ఆ తర్వాత డియర్ కామ్రేడ్ సినిమాతో ఆశించినంత విజయాన్ని సాధించలేకపోయారు. కానీ తమ మధ్య కెమిస్ట్రీతో మెప్పించారు. యాక్టింగ్ తో ఆకట్టుకున్నారు. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. మరి ఎలాంటి హిట్ అందుకుంటారో.. ఎలా మెప్పిస్తారో వేచి చూడాలి.

# కృతి శెట్టి మ్యాజిక్ ఫోటోలలో బంధించ బడింది



## ఆసియాకప్ లో భారత్-పాక్ మ్యాచ్‌పై వీడిన ఉత్కంఠ... అధికారిక ప్రకటన చేసిన బీసీసీఐ

- భారత్-పాకిస్థాన్ ఆసియా కప్ మ్యాచ్‌పై వీడిన సందిగ్ధత
- ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే మ్యాచ్ జరుగుతుందని బీసీసీఐ ప్రకటన
- యూఏఈ వేదికగా సెప్టెంబర్ 14న దాయాదుల మధ్య పోరు
- పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో మ్యాచ్‌పై నెలకొన్న అనుమానాలు
- బహుళ దేశాల టోర్నీలకు మాత్రమే కేంద్రం అనుమతి



ఆసియా కప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో టీమిండియా తలపడుతుందా లేదా అనే ఉత్కంఠకు తెరపడింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే సెప్టెంబర్ 14న దాయాదుల మధ్య మ్యాచ్ జరుగుతుందని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ క్రీడా మార్గదర్శకాలకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ 22న పహల్గాంలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది పర్యాటకులు మరణించిన విషయం తెలిసిందే. ఈ దారుణ ఘటన తర్వాత పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలను పూర్తిగా తెంచుకోవాలని అభిమానులు, పలువురు మాజీ క్రికెటర్ల నుంచి తీవ్ర స్థాయిలో డిమాండ్లు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే యూఏఈ వేదికగా జరగనున్న ఆసియా కప్‌లో భారత్-పాక్ మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి.

ఈ సందిగ్ధత నడుమ, ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం క్రీడావిధానంపై నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. దీని ప్రకారం, శత్రు దేశాలతో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడరాదని, అయితే ఆసియా కప్, ప్రపంచ కప్ వంటి బహుళ దేశాల టోర్నమెంట్లలో మాత్రం పాల్గొనవచ్చని సూచించింది. ఆసియా కప్ మల్టీ-నేషనల్ ఈవెంట్ కావడంతో, టీమిండియా ఆడేందుకు మార్గం సుగమమైంది.ఈ విషయంపై తాజాగా బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ, "ప్రభుత్వ నిబంధనలను అనుసరించి బీసీసీఐ నడుచుకుంటుంది. ఆసియా కప్‌లో భాగంగా టీమిండియా పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడుతుంది" అని అధికారికంగా ప్రకటించారు. దీంతో అన్ని అనుమానాలకు తెరపడినట్లయింది. యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు ఆసియా కప్ 2025 జరగనుంది. భారత జట్టు తన తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న యూఏఈతో ఆడనుంది.

## కుర్రాళ్లకు కెప్టెన్‌గా శ్రేయాస్.. ఆస్ట్రేలియా 'ఎ' సిరీస్‌కు భారత 'ఎ' జట్టు ప్రకటన





టీమిండియా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ భారత టెస్ట్ క్రికెట్ లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్టు అర్థమవుతోంది. టీమిండియా చివరిసారిగా ఇంగ్లాండ్ తో ఆడిన ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ కు శ్రేయాస్ అయ్యర్ స్క్వాడ్ లో స్థానం లభించలేదు. అయితే సెలక్టర్లు మాత్రం ఇండియా-ఏ జట్టుకు శ్రేయాస్ అయ్యాను కెప్టెన్ చేసి టెస్ట్ క్రికెట్ లోకి రానున్నట్టు సంకేతాలు ఇచ్చారు. సెప్టెంబర్ 16 నుంచి ఆస్ట్రేలియా- ఏ జట్టుతో భారత-ఏ జట్టు రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఫస్ట్ క్లాస్ మ్యాచ్ లకు 15 మందితో కూడిన భారత జట్టును శనివారం (సెప్టెంబర్ 6) బీసీసీఐ ప్రకటించింది.

ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపికైన ప్రసిద్ధ్ కృష్ణ, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, ఎన్ జగదీశన్ కు జట్టులో స్థానం దక్కింది. ఇండియా ఎ జట్టులోకి కొత్తగా హర్ష్ దుబే, ఢిల్లీ బ్యాటర్ ఆయుష్ బదోని, ఫాస్ట్ బౌలర్లు యష్ ఠాకూర్, గుర్నూర్ బ్రార్ ఉన్నారు. సెప్టెంబర్ 16 నుంచి 19 వరకు తొలి టెస్ట్.. సెప్టెంబర్

శ్రేయాస్ అయ్యర్ కు కెప్టెన్సీ అవకాశం దక్కింది. 30 ఏళ్ళ అయ్యర్ 2024 లో ఇంగ్లాండ్ తో జరిగిన టెస్ట్ సిరీస్ లో చివరిసారిగా ఆడాడు. ధృవ్ జురెల్ కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్ లో మోకాలి గాయం నుంచి కోలుకుంటున్న నితీష్ కుమార్ రెడ్డి స్క్వాడ్ లో ఉన్నాడు. లక్నోలోని ఎకానా స్టేడియంలో ఈ రెండు మ్యాచ్ లు జరుగుతాయి. భారత టెస్ట్ జట్టులో రెగ్యులర్ ప్లేయర్లు కెఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్ సెప్టెంబర్ 23 నుండి ప్రారంభమయ్యే రెండో మ్యాచ్ కు అందుబాటులో ఉంటారు. అక్టోబర్ లో జరగబోయే టెస్ట్ సిరీస్ కు ముందు భారత ఆటగాళ్ల ప్రాక్టీస్ కు ఉపయోగపడనుంది.

23 నుంచి 26 వరకు రెండో మ్యాచ్ జరుగుతుంది. సర్ఫరాజ్ ఖాన్, రజత్ పాటీదార్, రుతురాజ్ గైక్వాడ్ లకు జట్టులో స్థానం దక్కలేదు.

**ఆస్ట్రేలియాతో ఏ సిరీస్ కు భారత ఏ జట్టు:**

శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, ఎన్ జగదీశన్ ( వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధృవ్ జురెల్ ( వైస్ కెప్టెన్, వికెట్ కీపర్) దేవదత్ పడిక్కల్, హర్ష్ దూబే, ఆయుష్ బదోని, నితీష్ కుమార్ రెడ్డి, తనుష్ కోటియన్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బార్, ఖలీల్ అహ్మద్, మానవ్ సుతార్, యష్ ఠాకూర్

## కోహ్లీ, రోహిత్ కంటే అతడిని ఔట్ చేయడం చాలా కష్టం: పాకిస్థాన్ స్టార్ పేసర్





ప్రస్తుత జనరేషన్ లో బెస్ట్ బౌలర్ల లిస్ట్ లో పాకిస్థాన్ స్టార్ పేసర్ షహీన్ అఫ్రిది కూడా ఒకడు. స్వింగ్, యార్కర్లతో ఇప్పటికే ప్రపంచానికి తానేంటో నిరూపించుకున్నాడు. టీమిండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను సైతం అఫ్రిదీ బోల్తా కొట్టించాడు. తనదైన రోజున తన మొదటి స్పెల్ తో మ్యాచ్ ఫలితాన్ని మార్చేస్తాడు. ప్రస్తుతం ఆసియా కప్ కోసం సిద్ధమవుతున్న ఈ పాక్ పేసర్ తన కెరీర్ లో ఔట్ చేయడానికి అత్యంత కఠిన బ్యాటర్ ఎవరో చెప్పుకొచ్చాడు. కోహ్లీ, రోహిత్ కాకుండా సౌతాఫ్రికా దిగ్గజ క్రికెటర్ పేరు చెప్పడం విశేషం. సౌతాఫ్రికా మాజీ ఓపెనర్, బ్యాటింగ్ లెజెండ్ హషీమ్ ఆమ్లాను అత్యంత కఠిన బ్యాటర్ గా ఎంచుకున్నాడు. తాను ఆడే రోజుల్లో ఆమ్లాను ఔట్ చేయడానికి చాలా కష్టపడేవాడినని తెలిపాడు. " నేను ఆమ్లాతో టెస్ట్, వన్డే మ్యాచ్ లు ఆడాను. అతన్ని ఔట్ చేయడం చాలా ఛాలెంజింగ్ గా అనిపించేది. ఇటీవలే ఇంగ్లాండ్‌లో జరిగిన వైటాలిటీ టీ20 బ్లాస్ట్‌లో ఆమ్లాతో ఒక మ్యాచ్ ఆడాను. నేను చుసిన వాళ్లలో గొప్ప బ్యాటర్. అతను ఏం చేయాలనుకుంటాడో పక్కాగా చేస్తాడు". అని అఫ్రిది ఒక పోడ్ కాస్ట్ లో తెలిపాడు. అఫ్రిది వన్డే కెరీర్ లో ఆమ్లాను రెండు సార్లు ఔట్ చేశాడు.

42 ఏళ్ల ఆమ్లా 15 ఏళ్ల ఇంటర్నేషనల్ కెరీర్‌లో అన్ని ఫార్మాట్‌ల్లో కలిపి 349 మ్యాచ్‌లాడి 18000 పైగా పరుగులు చేశాడు. ఇందులో 55 సెంచరీలు, 88 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 181 వన్డేల్లో 8113 పరుగులు చేశాడు. వీటిలో 27 సెంచరీలు, 39 హాఫ్ సెంచరీలున్నాయి. 124 టెస్టులు ఆడిన ఆమ్లా 9282 పరుగులు చేశాడు. ఇందులో 28 సెంచరీలుండగా, 41 హాఫ్ సెంచరీలున్నాయి. 44 టీ20ల్లో ఆమ్లా 8 హాఫ్ సెంచరీలతో 1277 రన్స్ చేశాడు. సౌతాఫ్రికా తరపున అత్యధిక టెస్టు పరుగులు చేసిన రెండో ఆటగాడు హషీమ్ ఆమ్లా నిలిచాడు. ఇక అఫ్రిది విషయానికి వస్తే పాకిస్థాన్ తరపున 84 టీ20ల్లో 107, 66 వన్డేల్లో 131, 31 టెస్టుల్లో 116 వికెట్లు పడగొట్టాడు.

**CITIZENS TIMES TELUGU DAILY** Printed, Published and Owned by M.S.R.PATNAIK, D.NO.44-22-15/1, Near Ramalayam Veedhi, Rly New Colony,visakhapatnam-530016, Printing at Padmaja Printing Press, D.No.44-22-15/1, Near Ramalayam Veedhi, Rly New Colony, Visakhapatnam-530016, Andhra Published D.No.44-22-15/1, Near Ramalayam Veedhi, Rly New Colony, Visakhapatnam-530016, Chief Editor SANDEEP KUMAR, Cell No: 99664 47776 **RNI No: APTEL 28868/2009**